తల్లిదండ్రుల జ్ఞాపకార్థం విద్యార్థులకు చేయూత

బజార్‌హత్నూర్ : తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఫౌండేషన్ ఏర్పాటు చేసి సర్కారు బడి విద్యార్థులకు రూ. లక్షల విలువైన సామగ్రిని ఏటా అందజేస్తూ ఉదారత చాటుతున్నారు హైదరాబాద్‌కు చెందిన సంగిశెట్టి బాబు. శనివారం మండలంలోని దేగామలో యాద శంకర మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు రూ.5 లక్షల విలువైన బ్యాగులు, వాటర్ బాటిళ్లు, ఇతర విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. విద్యార్థులు ఉన్నతంగా రాణించి తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలని దాత ఆకాంక్షించారు. ఆయనను పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు జీవన్‌కుమార్, సమీర్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నవతెలంగాణ 1
ఆదిలాబాద్
ఆదివారం | సెప్టెంబర్ 03, 2023 | www.navatelangana.com

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ జగ్రామ్ అంతర్వేది శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంగ్లీష్‌లో ఒకటి, ఉర్దూ మాధ్యమం బాటనీ, కెమిస్ట్రీలలో ఒక్కోటి చొప్పున ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. అభ్యర్థులు పీజీ సంబంధిత సబ్జెక్టులో కనీసం 55శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50శాతం మార్కులు కలిగి ఉన్నా అర్హులే అన్నారు. నెట్ సెట్ పీహెచ్‌డీ కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. బోధనా అనుభవం ఉన్న అభ్యర్థులు సంబంధిత ధ్రువపత్రం అందజేస్తే వెయిటేజీ ఉంటుందని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు సంబంధిత ధ్రువపత్రాలతో ఈ నెల 4వ తేదీలోగా కళాశాలలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. 5వ తేదీన ఉదయం 10 గంటల నుంచి తమ కళాశాలలో ఇంటర్వ్యూ నిర్వహిస్తామన్నారు. పూర్తి వివరాలకు కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

- ఉపాధ్యాయుల బదిలీలు..పదోన్నతులకు షెడ్యూల్
- నేటి నుంచి ప్రారంభం..నెల రోజుల్లో పూర్తికి ఆదేశాలు
- దీర్ఘకాలంగా ఒకే చోట పనిచేస్తున్న వారికి ప్రయోజనం
- ఫలించిన ఉపాధ్యాయ సంఘాల పోరాటం

ఏండ్ల నిరీక్షణకు తెర..!

ప్రభుత్వం ఎట్టకేలకు ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. శుక్రవారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఈ ప్రక్రియకు సంబంధించిన షెడ్యూల్ విడుదల చేశారు. ఫలితంగా దీర్ఘకాలికంగా ఒకే చోట పనిచేస్తున్న ఉపాధ్యాయులతో పాటు పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్న వారికి ప్రయోజనం కలగనుంది. ఈ ప్రక్రియను ఈ నెల 3వ తేదీ నుంచి ప్రారంభించి వచ్చే నెల ఇదే తారీఖు వరకు పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే విద్యాశాఖ వర్గాలు ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితాను సిద్ధం చేశారు. ఆదివారం నుంచి ఈ నెల 5తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఈ బదిలీలు, పదోన్నతుల ద్వారా ఖాళీ అయ్యే స్థానాల్లో కొత్తగా నియామకాలు చేపట్టే అవకాశం ఉండటంతో నిరుద్యోగుల్లోనూ ఆనందం వ్యక్తమవుతోంది. ఈ క్రతువు చేపట్టాలని అనేక ఏండ్లుగా ఉపాధ్యాయ సంఘాలు పోరాటం కొనసాగించాయి.తాజాగా రాష్ట్ర హైకోర్టు బదిలీలు, పదోన్నతులకు చేపట్టాలని ఆదేశాలు జారీ చేయడంతో ఈ ప్రక్రియకు మార్గం సుగుమమైంది. మరోపక్క ఎన్నికల సమయం దగ్గర పడుతుండటంతో ప్రభుత్వం ఈ ప్రక్రియ చేపట్టేందుకు సిద్ధం కావడం ప్రాధాన్యం సంతరించుకుంది.


ఉపాధ్యాయుల జాబితాను తయారు చేస్తున్న విద్యాశాఖ అధికారులు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపట్టేందుకు రంగం సిద్ధం చేస్తోంది. ఇప్పటికే తేదీల వారీగా చేపట్టే షెడ్యూల్‌ను విడుదల చేసింది. దీంతో దీర్ఘకాలికంగా ఒకే చోట పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఇతర చోటుకు వెళ్లేందుకు అవకాశం లభిస్తోంది. ఎనిమిదేండ్లుగా పనిచేస్తున్న ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్లకు తప్పనిసరి బదిలీ కాగా.. ఐదేండ్లుగా ఒకే చోట పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులకు బదిలీ కానుంది. మరోపక్క పదోన్నతులు కూడా చేడుతుండటంతో ఖాళీలు, అర్హతలను బట్టి ఎస్జీటీలకు స్కూల్‌అసిస్టెంట్లు, పీఎస్ హెచ్‌ఎంలుగా.. స్కూల్ అసిస్టెంట్లు పీజీహెచ్‌ఎంలుగా పదోన్నతి పొందనున్నారు. ఇది వరకు 2018లో బదిలీలు చేపట్టినప్పటికీ 2010 వరకు పనిచేసిన వారితో పాటు 2013 వరకు పీజీహెచ్‌ఎంలకు బదిలీలు జరిగాయి. 2011 నుంచి ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్లు పన్నెండేండ్లుగా.. 2013 నుంచి పీజీహెచ్‌ఎంలు పదేండ్లుగా బదిలీల కోసం ఎదురుచూస్తున్నారు. ఇక పదోన్నతులు చివరి సారిగా 2015లో చేపట్టగా ఎనిమిదేండ్లుగా ఈ ప్రక్రియ చేపట్టలేదు. దీంతో చాలా మంది ఉపాధ్యాయులు పదోన్నతులు పొందకుండానే ఉద్యోగ విరమణ పొందారు. ముఖ్యంగా సెప్టెంబర్ 1వ తేదీ వరకు కటాఫ్‌గా నిర్ణయించడంతో 2015లో బదిలీలు జరిగిన ఉపాధ్యాయులకు తాజా ప్రక్రియలో అవకాశం లభించనుంది.

ఖాళీలతో నిరుద్యోగులకు లాభం..!

ప్రభుత్వం తాజాగా చేపడుతున్న బదిలీలు, పదోన్నతుల ప్రక్రియతో ఏర్పడే ఖాళీలతో ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్లకు ప్రయోజనం కలగనుంది. ముఖ్యంగా వీరితో పాటు కొత్తగా ఖాళీలు ఏర్పడి నూతన నియామకాలు పెరిగేందుకు ఆస్కారం ఉంటుంది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం 5099పోస్టులను టీఆర్‌టీ ద్వారా భర్తీ చేయాలని యోచిస్తోంది. కానీ వాస్తవానికి రాష్ట్రంలో సుమారు 22వేలకు పైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రభుత్వం బదిలీలు, పదోన్నతులు ప్రక్రియ చేస్తే మరో 9వేల వరకు పోస్టులు ఖాళీ కానున్నాయి. దీంతో ప్రస్తుతం ప్రభుత్వం నిర్ణయించిన 5099పోస్టులతో పాటు అదనంగా 9వేల పోస్టులు కలిపితే 14వేలకు పైగా పోస్టులు భర్తీ చేసేందుకు అవకాశం ఉంటుంది. దీంతో టెట్ పూర్తిచేసి టీఆర్‌టీ కోసం ఏండ్లుగా ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు తాజాగా ఏర్పడే ఖాళీలతో ప్రయోజనం దక్కేందుకు అవకాశం ఉంటుందని విద్యాశాఖవర్గాలు చెబుతున్నాయి.

షెడ్యూల్ ఇదీ..!

ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు సంబంధించి ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసింది. ఈ నెల 3నుంచి 5వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ, 6నుంచి 8వరకు దరఖాస్తులను డీఈఓ కార్యాలయంలో అందజేయడం, 8, 9తేదీల్లో దరఖాస్తుదారుల పేర్లను ప్రదర్శిస్తారు. 10,11తేదీల్లో అభ్యంతరాల స్వీకరణ, 12,13 తేదీల్లో సీనియార్టి జాబితా ప్రదర్శన, 14న ఎడిట్ ఆప్షన్, 15న ఆన్‌లైన్ ద్వారా ప్రధానోపాధ్యాయుల బదిలీలు, 16న ప్రధానోపాధ్యాయుల ఖాళీల ప్రదర్శన, 17,18,19తేదీల్లో ఎస్‌ఏలకు ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి, 20,21 తేదీల్లో ఖాళీ అయిన స్కూల్ అసిస్టెంట్ పోస్టుల ప్రదర్శన, 21న వెబ్‌ఆప్షన్, 22న ఎడిట్ ఆప్షన్, 23,24తేదీల్లో స్కూల్ అసిస్టెంట్ల బదిలీలు, 24న స్కూల్‌అసిస్టెంట్ ఖాళీల ప్రదర్శన, 26, 27,28తేదీల్లో ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు, 29,30,31తేదీల్లో ఎస్జీటీల ఖాళీల ప్రదర్శన, అక్టోబర్ 2న ఎడిట్ ఆప్షన్, 3న ఎస్జీటీ, భాషా పండితులు, పీఈటీల బదిలీలు, 5నుంచి 19వరకు అప్పీళ్లకు అవకాశం ఇచ్చింది.

బదిలీలు, పదోన్నతులు చేపట్టడం హర్షణీయం : వరగంటి అశోక్, టీఎస్‌యూటీఎఫ్, జిల్లా ప్రధాన కార్యదర్శి



ప్రభుత్వం బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ ప్రకటించడం హర్షణీయం.గత 12 ఏండ్లుగా ఒకే చోట పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఎనిమిదేండ్లుగా పదోన్నతులకు నోచుకోని అర్హులకు ఇది ఊరటనిచ్చే అంశం. ఎలాంటి అవకతవకలు, అసౌకర్యాలకు తావు లేకుండా బదిలీలను ఆన్‌లైన్ ద్వారా చేపట్టాలి. పదోన్నతులను మాత్రం భౌతికంగా నిర్వహించాలి. ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన ఖాళీలతో పాటు బదిలీలు, పదోన్నతుల ద్వారా ఏర్పడే ఖాళీలను టీఆర్‌టీ ద్వారా భర్తీ చేయాలి. ఈ ప్రక్రియను సజావుగా చేపట్టేలా జాగ్రత్తలు తీసుకోవాలి.

పూర్తికాని పనులను పరిశీలించిన రాష్ట్ర బృందం



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

స్వచ్ఛ భారత్ పర్యవేక్షణలో భాగంగా కేంద్ర బృందం ముత్నూర్ గ్రామాన్ని సందర్శించనున్న నేపథ్యంలో శనివారం రాష్ట్ర బృందం సభ్యులు కిషోర్, సునీల్, వెంకటేష్ సందర్శించారు. పంచాయతీలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ వాడల్లో చేపట్టిన ఇంటింటికీ మరుగుదొడ్లు, సామాజిక ఇంకుడు గుంతలు, మురుగు కాలువలు, పచ్చదనం పరిశుభ్రత, అంగన్‌వాడీ కేంద్రం తదితర పనులను పరిశీలించారు. గోండుగూడలో అసంపూర్తిగా ఉన్న పనులను దగ్గరుండి పూర్తి చేయించారు. పంచాయతీలో చెత్తాచెదారం లేకుండా చుట్టూ పక్క పంచాయతీల నుంచి సిబ్బందిని ముత్నూర్‌లోనే మోహరిస్తున్నారు. దీంతో ఇతర పంచాయతీలో ప్రతి రోజూ చేయాల్సిన చెత్తాచెదారం తరలింపు, తాగు నీటి క్లోరినేషన్ తదితర పనులకు అంతరాయం ఏర్పడుతుందని ప్రజలు పేర్కొంటున్నారు. త్వరలో కేంద్ర పర్యవేక్షణ బృందం పర్యటించనున్నందున డీఆర్‌డీఓ కిషన్, అడిషనల్ డీఆర్‌డీఓ రాథోడ్ రాజేశ్వర్, డిపిఓ శ్రీనివాస్, ఎంపిడిఓ పుష్పలత తదితరులు ముత్నూర్‌లోనే మకాం వేశారు. వివిధ పనులను పర్యవేక్షిస్తున్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల సంక్షేమానికి సింగరేణి అండ



నవతెలంగాణ-నస్పూర్

కాంట్రాక్ట్ కార్మికుల సంక్షేమంలో సింగరేణి సంస్థ ఎల్లప్పుడూ తోడు ఉంటుందని శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్ బి సంజీవరెడ్డి అన్నారు. శనివారం శ్రీరాంపూర్ ఉపరితల గనిలో ఓబి కాంట్రాక్ట్ కంపెనీ ప్రసాద్ సుశీలో పని చేసిన కుమార్ కరోనా వ్యాధితో చనిపోవడంతో సింగరేణి సంస్థ భార్య సుహాసినికి రూ.15లక్షల చెక్కును అందజేసింది. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ సంస్థలో పని చేస్తున్న ఉద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగుల సంక్షేమంలో సింగరేణి యాజమాన్యం ఎల్లవేళలా తోడు ఉంటుందన్నారు. తోటి ఉద్యోగి మరణించడం చాలా బాధాకరమైన విషయమని, వారి కుటుంబ సభ్యులకు ఎల్లవేళల తోడు ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఉపాధ్యక్షులు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, ఇన్చార్జి డిజిఎం పర్సనల్ రాజేశ్వరరావు, డిప్యూటీ పీఎం దేవేందర్‌రెడ్డి, అకౌంట్స్ ఆఫీసర్ పద్మ, పీఏ టూ జీఎం వరప్రసాద్ పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన



నవతెలంగాణ - పెంచికల్‌పేట్

మండలంలోని పోతపెల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ చంద్రమౌళి అధ్యక్షతన ఓటు హక్కుపై, ఓటరు జాబితాపై గ్రామసభ నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఓటు హక్కును కలిగి ఉండాలని, ఓటరు జాబితాలో పేరు ఉందో లేదో సరిచూసుకోవాలన్నారు. నూతనంగా వచ్చిన తహసీల్దార్‌కు సర్పంచ్ చంద్రమౌళి గ్రామస్తులతో కలిసి సన్మానించారు. కార్యక్రమంలో ఆర్ఐ సురేష్, బీఎల్ఓ లీలా, వార్డుసభ్యుడు సాంబయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్వచ్ఛతపై అవగాహన

నవతెలంగాణ-కౌటాల

మండలంలోని గుండాయిపేట్ పాఠశాలలో శనివారం స్వచ్ఛత పక్షోత్సవాల్లో భాగంగా స్వచ్ఛత దినోత్సవం గురించి ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇందులో చేతులు ఎలా శుభ్రం చేసుకోవాలో విద్యార్థులతో చేసి చూపించారు. అనంతరం వ్యాసరచన, పెయింటింగ్, స్లోగన్స్, పద్య పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హనుమంతు మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత, పాఠశాల ఆవరణ, మరుగుదొడ్లు, తరగతి గదులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రోడ్లపై మలమూత్ర విసర్జన చేయకూడదని, చెత్త రోడ్లపై వేయకూడదని వాటివల్ల మనకు వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తపడాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు జిల్లా స్థాయి నెట్ బాల్ సీనియర్స్ సెలక్షన్స్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా స్థాయి నెట్ బాల్ సీనియర్ సెలక్షన్స్ జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో సోమవారం నిర్వహిస్తామని నెట్ బాల్ జిల్లా అధ్యక్షుడు అలీబిన్ హైమద్, ఆదర్శ కళాశాల ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్, జిల్లా సెక్రటరీ బి.తిరుపతి, జిల్లా కోచ్‌లు హరీష్, యోగి, అర్చనకుమారి ఉమ్మడి ప్రకటనలో పేర్కొన్నారు. సెలక్షన్స్‌కు వచ్చే వారు ఆధార్ జిరాక్స్, 4 పాస్ పోర్ట్ సైజు ఫొటోస్, ఎస్సెస్సీ మెమోతో ఉదయం 10 గంటలకు తెలంగాణ ఆదర్శ పాఠశాలలో హాజరు కావాలని తెలిపారు. మిగతా వివరాలకు జిల్లా నెట్ బాల్ కోచ్ హరీష్(9581583836)ను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-నిర్మల్

నేషనల్ హెల్త్ మిషన్ పరిధిలో పనిచేస్తున్న కాంటాక్ట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ అన్నారు. శనివారం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. నేషనల్ హెల్త్ మిషన్ పరిధిలో యుపీహెచ్‌సీ, యుసిహెచ్‌సిలో పనిచేస్తున్న కాంటాక్ట్ అవుట్ సోర్సింగ్ పారామెడికల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఎన్‌హెచ్‌ఎంలో సుమారు 17వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారన్నారు. వీరిలో అత్యధికులకు రాష్ట్ర ప్రభుత్వం పిఆర్సి ప్రకారం జీతాలు చెల్లించడం లేదన్నారు. గతంలో జీవో నెంబర్ 510 ద్వారా సుమారు పదివేల మంది వరకు డాక్టర్లు, స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మాసిస్టులు ఏఎన్ఎంలకు బేసిక్ ప్రకారం వేతనం నిర్ణయించి చెల్లిస్తున్నారన్నారు. ఇందులో కొన్ని కేటగిరీలకు పర్మినెంట్ ఎంప్లాయిస్ బేసిక్ కన్నా తక్కువ చెల్లిస్తున్నారన్నారు. మిగిలిన సుమారు 7000 మందికి కనీసం బేసిక్ కాకుండా అతి తక్కువ వేతనం చెల్లిస్తున్నారని విమర్శించారు. వీరందరికీ కనీస వేతనం డిఏ హెచ్‌ఆర్ఏ ఇతర అలవెన్సులు నిర్ణయించి అమలు చేయాలన్నారు. ఎన్‌హెచ్‌ఎంలో పనిచేస్తున్న కార్మికులందర్నీ పర్మినెంట్ చేయాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, 510 జీవో అమలు చేసి బేసిక్ డిఏ, శాలరీ నిర్ణయించాలన్నారు. హెచ్ఆర్ పాలసీని రూపొందించాలన్నారు. మెడికల్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ, జిల్లా నాయకులు రాములు, సాదిక్, లత, నస్రీన్, సురేఖరాణి, నవీన్ పాల్గొన్నారు.

ఘనంగా ఆదివాసీ సకల కళా వార్షికోత్సవం



నవతెలంగాణ-ఇచ్చోడ

మండల కేంద్రంలో ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివాసీ సకల కళా సంక్షేమ సంఘం మొదటి వార్షికోత్సవం ఘనంగా జరిగింది. మొదటగా ప్రముఖ ఆదివాసీ నాయకులు కొడప నగేష్, సకల కళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు తానుబాయి, ప్రధాన కార్యదర్శి కాత్లే శ్రీధర్, సభ్యులు కళాకారులు ఆదివాసీ తొమ్మిది తెగల సాంప్రదాయ వాయిద్యాలకు పూజ నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణలోని పలు ప్రాంతాల నుండి వచ్చిన ఆదివాసీ కళాకారులు తమ సాంప్రదాయ నృత్యాలైన గుస్సాడి, డెంసా, తప్పెట గుళ్ళు, తదితర నృత్యాలు, ఆదివాసీ మహనీయులపై పాటలు పాడారు. అనంతరం కళాకారులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సకల కళా సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కాత్లే శ్రీధర్ మాట్లాడుతూ సంఘం ద్వారా కళాకారులందరికీ వేదిక కల్పించి ముందు ముందు మరిన్ని అవకాశాలు రావడానికి తోడ్పాటు అందిస్తామన్నారు. కార్యక్రమంలో రేలా రవి, రేలా ఆనంద్, ఇండ్ల అశోక్, మెస్రం రవి, గేడం రాము, వెట్టి యోవధాన్, బాపురావ్, కనక సుదర్శన్, పెందూర్ భగవంత్‌రావ్, లక్ష్మణ్, మహిళా కళాకారులు మీరాబాయి, సుగుణబాయి, ఆదివాసీ సింగర్‌లు సుమలత, శైలజ, స్వాతి, ఆదివాసీ నాయకులు కుమ్రం కోటేశ్వర్, కాంగ్రెస్ నాయకులు వసంత్‌రావ్, గుడిహత్నూర్ మండల అధ్యక్షుడు కరుణాకర్, సీనియర్ నాయకుడు హైమద్ పాల్గొన్నారు.

సీసీ కెమెరాకు చిక్కిన చిరుత

- మేకను చంపి, తిరిగి మళ్లొచ్చి ఎత్తుకెళ్లిన చిరుత
- శివారు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఫారెస్ట్ అధికారులు



నవతెలంగాణ - కాసిపేట

మండలంలోని ముత్యంపల్లి ఫారెస్ట్ సెక్షన్ పరిధిలోని పెద్ద ధర్మారం అటవీ శివారులో మేకల మందపై దాడి చేసి మేకను చంపింది చిరుత పులేనని సీసీ కెమెరాలో రికార్డయింది. శుక్రవారం మేకల కాపరులు మేకలను మేపడానికి పెద్ద ధర్మారం అటవీ శివారులోకి వెళ్లగా ఒక్కసారిగా మేకల మందపై చిరుత పులి దాడి చేసి మేకను చంపి లాక్కొని వెళ్లింది. దీంతో పులిని చూసిన మేకల కాపరులు అక్కడి నుంచి పరుగులు తీసి, కొంత మందితో కలిసి చిరుత దాడి చేసిన ప్రాంతానికి వెళ్లగా చంపిన మేకను వదిలేసి చిరుత వెళ్లిపోయింది. ముందుగా అది పెద్ద పులిగా మేకల కాపరులు తెలపగా చిరుతగా తేలింది. మేకను చంపిన చిరుత ప్రాంతంలో చనిపోయిన మేకను అక్కడే ఉంచి అటవీ అధికారులు సీసీ కెమెరాలను అమర్చారు. 15 నిమిషాల తేడాలోనే చిరుత పులి మళ్లీ వచ్చి చంపిన మేకను ఎత్తుకొని అడవిలోకి వెళ్లిందని సీసీ కెమెరాల్లో రికార్డు అయిందని అధికారులు తెలిపారు. చిరుత చంపిన మేక కోసం అక్కడే ఉన్నట్లు తెలిపారు. శనివారం ఉదయం సీసీ కెమెరాలు చూడగా శుక్రవారం సీసీ కెమెరాలు పెట్టిన 15 నిమిషాల్లోనే చిరుత అక్కడి వచ్చి చనిపోయిన మేకను ఎత్తుకొని వెళ్లిందని అధికారులు వివరించారు. పెద్ద ధర్మారం, గురువాపూర్ శివారు అటవీ ప్రాంతంలో చిరుత పులి సంచరిస్తూ ఉండడంతో ఈ ప్రాంత గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. తమ గ్రామాలు సమీపంలో ఉండడంతో గ్రామాల వద్దకు వచ్చే అవకాశం ఉందని ఆందోళనకు గురవుతున్నారు. చిరుత పులి సంచారం ఉన్నందున శివారు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ ఫారెస్ట్ రేంజర్ ప్రవీణ్ నాయక్ సూచించారు. అటవీ ప్రాంతంలోకి పశువులను, మేకలను తీసుకువెళ్లవద్దని తెలిపారు. శివారు గ్రామాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, చిరుత సంచారం ఉంటే వెంటనే సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు.

ఈవీఎంలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలి



నవతెలంగాణ-భీమిని

మండల కేంద్రంలో గ్రంథాలయం శాఖ ఆవరణలో ఈవీఎంలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈవీఎంలో ఓటు ఎలా వేయాలని, వివి ప్యాడ్స్ గురించి ప్రజలకు కళాజాత బృందం సభ్యులు తెలియజేశారు. ఈవీఎం మిషిన్‌లో ఏ విధంగా ఓటు వేయాలనేది చూపిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ వెంకటేశం, అంగన్వాడీ టీచర్ లక్ష్మి, వార్డ్ మెంబర్ జంబోజి లక్ష్మీబాయి, శంకర్, కళాజాత బృందం సభ్యులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీని వెంటనే ప్రకటించాలి

నవతెలంగాణ-తాండూర్

ప్రభుత్వం 25వేల టీచర్ పోస్టులతో కూడిన మెగా డీఎస్సీని వెంటనే ప్రకటించాలని బెల్లంపల్లి కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆశావాహ అభ్యర్థి నాతారి స్వామి డిమాండ్ చేశారు. శనివారం మెగా డీఎస్సీ కోసం ఎన్ఎస్‌యూఐ చేపట్టిన దీక్షకు మద్దతు తెలిపి దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25వేలతో మెగా డీఎస్సీని తక్షణమే ప్రకటించాలని, మెగా డీఎస్సీలో ప్రమోషన్ల ఖాళీలను చూపించాలని, ఆర్ట్స్‌అండ్‌క్రాఫ్ట్ ఖాళీలను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను ప్రైవేటుకు ధీటుగా బలోపేతం చేయాలని, స్టూడెంట్ రేషియో కాకుండా సబ్జెక్టుల రేషియో ప్రకారం ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు, డీఎస్సీ బాధితులు, కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



మనస్తాపంతో వ్యక్తి బలవన్మరణం

నవతెలంగాణ -లోకేశ్వరం

మనస్తాపానికి గురై వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం..అబ్దుల్లాపూర్ గ్రామానికి చెందిన బి.ముత్యం(42) భార్య నాలుగు సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మరణించింది. అప్పట్నుండి ముత్యం మనస్తాపంతో మద్యానికి బానిసై ఎలాంటి పని చేయకుండా ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఆగస్టు 28న సాయంత్రం 4 గంటల సమయంలో ఇంటినుండి బయటకి వెళ్లి తిరిగి రాలేదు. ఈ విషయమై 30న తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో మిస్సింగ్ కేసు నమోదైంది. దర్యాప్తు చేస్తున్న క్రమంలో శనివారం వడ్తాల్ గ్రామ పల్లెప్రకృతి వనంలో ఉరేసుకొని కుళ్లిపోయి వేలాడుతున్న స్థితిలో కనిపించాడు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
ఆదివారం | సెప్టెంబర్ 03, 2023 | www.navatelangana.com

ఎంబీబీఎస్ సీటు సాధించిన విద్యార్థికి సన్మానం

నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని భీంపూర్ గ్రామానికి చెందిన గిరిజన పేద విద్యార్థి చౌహాన్ హరితకు సంగారెడ్డి జిల్లాలో ఎంబీబీఎస్ సీటు వచ్చింది. శనివారం భీంపూర్ గ్రామంలో స్థానిక సర్పంచ్ రాథోడ్ విష్ణు విద్యార్థికి మిఠాయి తినిపించి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పేద కుటుంబంలో జన్మించి, తండ్రి మేస్త్రి పని చేసుకుంటూ కష్టపడి ఒకటి నుంచి పదో తరగతి ఉట్నూర్‌లో



ఇంటర్, ఆదిలాబాద్‌లో, హైదరాబాద్‌లో కోచింగ్ తీసుకొని చదివించారని అన్నారు. ఎంబీబీఎస్ సీటు సాధించడంతో చాలా గర్వంగా ఉందని అన్నారు. ఇష్టపడి చదివితే సాధించనిది ఏమి ఉండదని అన్నారు. ప్రతిఒక్కరూ కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని పేర్కొన్నారు. సన్మానించి వారిలో గ్రామ పెద్దలు ఉన్నారు.

ఆలయానికి ఫ్యాన్లు అందజేత

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణం ఆదిత్యనగర్‌లో నూతనంగా నిర్మించిన సంకట మోచన్ హనుమాన్ ఆలయానికి ఆదిత్య ఖండేష్కర్ సొసైటీ అధ్యక్షుడు ఆదిత్య ఖండేష్కర్ ఆరు ఫ్యాన్‌లను శనివారం అందజేశారు. ఆలయ అభివృద్ధి కోసం తనవంతు సహాయ సహకారాలు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా ఆయనను ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖాత్రి, కృష్ణా గుండవార్ ఉన్నారు.



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్
- నిరుద్యోగుల సంతకాల సేకరణ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నిరుద్యోగం, అధిక ధరల సమస్యలను పరిష్కరించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శనివారం కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ అధిక ధరలను నిరుద్యోగం ఉపాధి కుదింపులకు వ్యతిరేకంగా సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో బీసీ స్టడీ సర్కిల్ దగ్గర నిరుద్యోగుల నుంచి సంతకాలను సేకరించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ మాట్లాడుతూ భారతదేశంలో యువత 65 శాతం వరకు ఉన్నారని చరిత్రలో ఎన్నడూ లేనంత గరిష్ట స్థాయికి నిరుద్యోగం పెరిగిందన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని బీజేపీ ఎన్నికల్లో వాగ్దానం చేసి గెలిచిన తర్వాత ఆ హామీని విస్మరించి నిరుద్యోగులకు తీరని అన్యాయం చేస్తుందన్నారు. ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలనే ప్రయివేటీకరిస్తూ ఉద్యోగాలకు ఎసరు తీసుకొచ్చే పని చేస్తుందన్నారు. అగ్నిపథ్ పేరుతో కాంట్రాక్టు ఉద్యోగాలను భర్తీ చేసి ఉపాధి భద్రతను దూరం చేస్తుందని అన్నారు. మరోవైపు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించి, దాన్ని నిర్వీర్యం చేసే పని చేస్తుందన్నారు. నిత్యావసర వస్తువులు, పెట్రోల్, డీజిల్ గ్యాస్ ధరలను రోజురోజుకు పెంచుతూ సామాన్యుల నడ్డివిరుస్తుందన్నారు. కార్పొరేట్లకు దేశ సంపదను ప్రభుత్వరంగ సంస్థలను అప్పనంగా కట్టబెడుతున్నదని అన్నారు. మోడీ ప్రభుత్వం 9 ఏండ్ల పాలనలో రూ.100 లక్షల కోట్ల అప్పును చేసి ప్రజలపై చరిత్రలో ఎన్నడూ లేనంత ఆర్థిక భారాలను మోపుతున్నదని పేర్కొన్నారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అనేక హామీలు ఇచ్చి వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఏడాదికి లక్ష ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, నోటిఫికేషన్ల లీకేజీలతో నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని ఆరోపించారు. ప్రతి ఒక్కరికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం దళిత గిరిజనులు అందరికీ మూడు ఎకరాల భూమిలాంటి హామీలను అటకెక్కించారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ప్రభుత్వ రంగంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేయాలని అన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని బలోపేతం చేసి నిధులను పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లంక రాఘవులు, పూసం సచిన్ అన్నమొల్ల కిరణ్, సీనియర్ నాయకులు బండి దత్తాత్రి, జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ ఆశన్న, సురేందర్, గంగన్న, కిష్టన్న, మంజుల, ఆశన్న, నవీన్ పాల్గొన్నారు.



104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టరేట్ ఎదుట ధర్నా



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలో ఒక రోజు ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట తెలంగాణ యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో 104 ఉద్యోగులు 2008 నుంచి డీఎస్సీ ద్వారా రూల్ ఆఫ్ రిజర్వేషన్, రోస్టర్ పాయింట్ పద్ధతిలో జీఓ నెం. 1636, మెమో నెం. 20639ల ప్రకారం పూర్తిగా ప్రభుత్వాధీనంలోనే (డ్రైవర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మాసిస్టులు, సెక్యూరిటీ గార్డులు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఏఎన్ఎంలు) 1,350 మంది విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. గత 15 సంవత్సరాలుగా 104 ఉద్యోగులు ఎలాంటి ఉద్యోగ భద్రత లేకుండా, చాలీచాలని వేతనాలతో సేవలు అందిస్తున్నారని అన్నారు. 104 ఎఫ్డిహెచ్ఎస్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలన్నారు. 104 ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని అన్నారు. ఉద్యోగులకు వేతనాలు చెల్లించుటలో ఏజెన్సీ విధానాన్ని రద్దు చేసి, ప్రభుత్వమే ట్రెజరీ ద్వారా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్‌లో ఉన్న ఏఎన్ఎంలను రెండో ఏఎన్ఎంలను గుర్తించి, రెగ్యులర్ చేయాలని అన్నారు. 104 ఉద్యోగులకు వారు ఇచ్చిన ఆప్షన్ ప్రకారం సొంత జిల్లాలకు బదిలీ చేయాలని, హెల్త్ కార్డు లేదా ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని అన్నారు. ఈ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 104 ఉద్యోగుల సమస్యల పరిష్కారం చేయాలని లేని యెడల రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న, సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్, 104 యూనియన్ జిల్లా అధ్యక్షులు నవీన్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ మామిడి వెంకన్న, జిల్లా కార్యదర్శి ఆనంద్, సురేందర్, ప్రశాంత్, అన్సారీ, నాగ్‌నాథ్, వామన్‌రావు, రవి, సుభాష్, ప్రేమ్, ఇబ్రహీం పాల్గొన్నారు.

నిర్మల్ : 104 ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ అన్నారు. శనివారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. 104 వ్యవస్థను నిర్వీర్యం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని అన్నారు. కనీసం ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అందులో భాగంగా 104లో పని చేస్తున్న ప్రతి ఉద్యోగికి ఏ శాఖ లోనైన రెగ్యులర్ ఉద్యోగిగా అవకాశం కల్పించాలని అన్నారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని అన్నారు. సుప్రీం కోర్టు గైడ్‌లైన్స్ పక్కగా అమలు చేయాలన్నారు. ఏజెన్సీ విధానాన్ని రద్దు చేయాలని అన్నారు. ట్రెజరీ ద్వారా వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో 104 ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, రాజేందర్, పండిత్, పాతూసా, మీరకుమారి, ఆనంద్, సామెల్, గణేష్ పాల్గొన్నారు.



రెండో ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలి

నవతెలంగాణ-నిర్మల్



రెండో ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని ఏఎన్ఎంలు అన్నారు. ఆర్డీఓ కార్యాలయం ఎదుట చేస్తున్న సమ్మె శనివారం 27వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమను రెగ్యులర్ చేయాలని ప్రధాన ఏజెండాతో పాటు పలు డిమాండ్లను పరిష్కరించాలని అన్నారు. సమ్మెలో పాల్గొన్న రెండో ఏఎన్ఎంలకు అధికారులు షోకాజ్ నోటీసులు ఇచ్చి భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. నోటీసులకు భయపడేది లేదని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కాంట్రాక్ట్ పద్ధతిని తొలగించి ఉద్యోగులందరిని క్రమబద్ధీకరిస్తామని హామీ ఇచ్చిన సీఎం కేసీఆర్ అధికారం చేపట్టాక హామీని మరిచిపోయారని పేర్కొన్నారు. ఎలాంటి పరీక్ష లేకుండా రెండో ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నుస్రత్, సుజాత, స్వాతి, కౌసల్య జమున, లక్ష్మీ రాజమణి, శారద, సునీత, మణి, యాస్మీన్, ఉమ, శ్యామల పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

నవతెలంగాణ-నిర్మల్

మామడ మండలం పొన్కల్ గ్రామానికి చెందిన నయీమ్ అనారోగ్యంతో, నిర్మల్ పట్టణంలో దేవేందర్‌రెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు శనివారం పరామర్శించారు. ఆర్థిక సాయం అందజేశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. నిర్మల్ పట్టణం మంజులాపూర్ కాలనీకి చెందిన చిన్నిగారి కుమారుడు మరణించగా విషయం తెలుసుకున్న డీసీసీ అధ్యక్షులు వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. పరామర్శించిన వారిలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

హార్టికల్చర్ పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కొండా లక్ష్మణ్ ఉద్యాన (హార్టికల్చర్) పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్ల ద్వారా 2 సంవత్సరాల డిప్లొమా కోర్సులో చేరేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ డా.మురళి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్హత పదో తరగతి, ఇంటర్మీడియట్ పాసై ఉండాలని అన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 11లోగా కళాశాలలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు. 8639460529, 8096969659 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఏఐఎస్ఎఫ్ సభ్యత్వ నమోదు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలో ప్రభుత్వ, ప్రయివేట్ జూనియర్ డిగ్రీ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ సభ్యత్వ నమోదును శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి గేడం కేశవ్ మాట్లాడుతూ త్యాగాల చరిత్ర కలిగిన విద్యార్థి ఉద్యమాల రథసారథి, భారత దేశంలో మొట్టమొదటి విద్యార్థి సంఘం అయినటువంటి ఏఐఎస్ఎఫ్‌లో విద్యార్థులు పెద్ద ఎత్తున సభ్యత్వాన్ని నమోదు చేసుకున్నారని అన్నారు. విద్యారంగ సమస్యలపై నిరంతరం కృషి చేస్తున్న విద్యార్థి సంఘమని అన్నారు. విద్యార్థులు పెద్ద ఎత్తున సభ్యత్వం నమోదు చేయడం సంఘానికి గౌరవం దక్కిందన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు మడవి గణేష్, మెస్రం ప్రవీణ్, గెడం మానిక్, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలకు ఇంటి యాజమాన్య హక్కు పత్రాల అందజేత

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



నవతెలంగాణ-సారంగాపూర్

మండలం కేంద్రంలో ఉరగుట్టపై దశాబ్దాలుగా నివాసం ఉంటున్న 47 మంది గూడులేని నిరుపేదలకు జీఓ నెంబర్. 58, 59 ప్రకారం క్రమబద్ధీకరణ చేస్తు ఇంటి యాజమాన్యం హక్కు పత్రాలను శనివారం మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అందజేశారు. ఈ సంద్భంగా మంత్రి మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమం కోసం పథకాలను అమలు చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ప్రభుత్వ భూముల్లో ఇండ్లు కట్టుకున్న పేదలకు వాటిని క్రమబద్ధీకరించి పట్టాలు అందజేస్తున్నట్లు చెప్పారు. పేద, మధ్య తరగతి కుటుంబాలు నివసిస్తున్న స్థలాలకు కూడా యాజమాన్య హక్కు లేక ఇబ్బందులు పడుతున్న వారికి రాష్ట్ర ప్రభుత్వం గొప్ప అవకాశం కల్పించిందని అన్నారు. ప్రభుత్వ స్థలాల్లో ఇండ్లు నిర్మించుకున్న అర్హులైన వారందరికీ పట్టాలు అందజేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామికవేత్త అల్లోల మురళీధర్‌రెడ్డి, జిల్లా రైతుబంధు అధ్యక్షులు వెంకట్ రామ్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ నారాయణరెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ ఆశ్రిత శ్రీనివాస్‌రెడ్డి, రైతుబంధు మండల కన్వీనర్ మధుకర్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మెన్ రాజ్ మహమ్మద్, రవీందర్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ సుజాత నర్సారెడ్డి, సర్పంచ్‌లు సంఘం అధ్యక్షులు రవీంద్రనాథ్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల కన్వీనర్ మాధవ్‌రావు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, తహసీల్దార్ శ్రీదేవి, ఆర్ఐ ముంతాజ్, లబ్దిదారులు పాల్గొన్నారు.

మహిళలు అభివృద్ధి చెందినప్పుడే సమాజం అభివృద్ధి

- హైకోర్టు న్యాయమూర్తి సూరేపల్లి నంద



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మహిళలు సర్వతో ముఖాభివృద్ధి చెందినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నంద అన్నారు. శనివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మహిళా సాధికారతపై నిర్వహించిన అవగాహన సదస్సులో జిల్లా ప్రధాన న్యాయమూర్తి డా.సీహెచ్ విఆర్ఆర్ వరప్రసాద్‌తో కలిసి ఆమె పాల్గొన్నారు. ముందుగా కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం హైకోర్టు న్యాయమూర్తి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు. స్త్రీ ఆర్థిక, రాజకీయ, సామాజిక స్వాలంబన కలిగి ఉన్నపుడే దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుందని వివరించారు. మహిళలు తమ హక్కులు, బాధ్యతలను తెలుసుకొని, అవకాశాలను వినియోగించుకుని తన కుటుంబంతో పాటు సమాజానికి ఉపయోగపడాలని అన్నారు. అన్ని రంగాలలో ప్రాతినిధ్యం వహించడంతో పాటు నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛ, సామర్థ్యాన్ని మహిళలు కలిగి ఉండాలని అన్నారు. స్త్రీ, పురుష సమానత్వం అవశ్యకతను వివరించి, మహిళా సాధికారత కోసం ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని తెలిపారు. అందులో భాగంగానే మహిళా సంక్షేమానికి, సాధికారతకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు విద్యా, ఉద్యోగాలలో రిజర్వేషన్లు, 1982-83లో డ్వాక్రా, 1992లో మహిళా కమిషన్ ఏర్పాటు, 2001లో జాతీయ మహిళా సాధికారత విధానం ప్రారంభించబడినవని వివరించారు. రాష్ట్రపతి, గవర్నర్ వంటి అత్యుత్తమ స్థాయిలలో సైతం మహిళలు సేవలందిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ, ప్రయివేట్, వాణిజ్య, క్రీడ రంగాలలో మరింత ఉన్నతంగా రాణించాలని ఆమె ఆకాంక్షించారు.



సమాజంలో మహిళల పాత్ర ముఖ్యమైనది..

జిల్లా ప్రధాన న్యాయమూర్తి వరప్రసాద్ మాట్లాడుతూ చదువుతోనే అభివృద్ధి సాధ్యమని, సమాజంలో మహిళల పాత్ర ముఖ్యమైనదని అన్నారు. ఈ నెల 9న జాతీయ లోక్‌అదాలత్‌ను నిర్వహించి, అన్ని రకాల కేసులను పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

కోర్టు ఆవరణలో మొక్కలు నాటిన జస్టిస్..



అంతకుముందు జిల్లా కోర్టు ప్రాంగణంలో సిబ్బంది భోజన గది నిర్మాణానికి హైకోర్టు న్యాయమూర్తి భూమిపూజ చేసి మొక్కలను నాటారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో ఎస్పీ డి.ఉదయ్ కుమార్‌రెడ్డి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి క్షమా దేశ్ పాండే, బార్ అసోసియేషన్ అధ్యక్షులు నగేష్, న్యాయమూర్తులు, విద్యార్థులు, మహిళలు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

టీఆర్టీ టీచర్ నోటిఫికేషన్ రద్దు చేయాలి

నవతెలంగాణ-ముధోల్

టీఆర్టీ టీచర్ నోటిఫికేషన్ రద్దు చేయాలని నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా ముధోల్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జీ భూషణ్ డిమాండ్ చేశారు. శనివారం ముధోల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2015లో ఇదే ప్రభుత్వం 15వేల టీచర్ పోస్టులు ఖాళీ ఉన్నాయని చెప్పి కేవలం 5వేల పోస్టులు ప్రకటించడం నిరుద్యోగుల నోట్లో మట్టి కొట్టడమేనని అన్నారు. ఈ రోజు సీఎం సర్వేలు చేస్తూ, అసెంబ్లీ టిక్కెట్లు ఇస్తున్నారని అన్నారు. డీఎడ్, బీఎడ్ చేసిన వారు ఎంతమంది ఉన్నారో కూడా తెలుసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ఒక నోటిఫికేషన్ కూడ సరిగ్గా ఇవ్వడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ వైఖరిని మార్చుకోవాలని, లేని యెడల ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ముధోల్ మండల ఇన్‌చార్జీ శశికుమార్, నవీన్, మోహినోద్దీన్, జ్ఞానేశ్వర్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన జాదవ్ సుభాష్ మహారాజ్ తండ్రి అనారోగ్యంతో మరణించగా విషయం తెలుసుకున్న బోథ్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం దేగామ గ్రామానికి సమీపంలోని హనుమాన్ మందిరాన్ని దర్శించుకున్నారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ నాయకు కాటిపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఇంటికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. భరంపూర్ కొండపై ఉన్న వెంకటేశ్వరస్వామి దర్శించుకున్నారు. ఆయన వెంట మండల బీఆర్ఎస్ నాయకులు కేదారీశ్వర్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు తిరుమల్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ త్రియంబక్, మాజీ జెడ్పీటీసీ డా.జహీర్, ముక్రా ఎంపీటీసీ సుభాష్, ఇచ్చోడ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు పాండురంగ్, ఉపసర్పంచ్ దేవేందర్‌రెడ్డి, రమాకాంత్, ఇమ్రాన్‌ఖాన్, భీంరావ్, కృష్ణ, లింగి సర్పంచ్ పొచ్చన్న, గంగారెడ్డి, గోవర్ధన్ రెడ్డి, గంగారాం, శ్రీకాంత్‌రెడ్డి, ధనుంజయ్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి మండల నాయకులు పాల్గొన్నారు.

గిరిజనులకు ప్రభుత్వం పెద్దపీట



నవతెలంగాణ-ముధోల్

తెలంగాణ సీఎం కేసీఆర్ గిరిజన అభివృద్ధికి పెద్ద పీట వేశారని ముధోల్ మండల బీఆర్ఎస్ అధ్యక్షులు అఫ్రోజ్ ఖాన్ అన్నారు. ముధోల్ మండలంలోని తరోడా తండాకు మొరం రోడ్డు కోసం ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి తన సీడీపీ నిధుల కింద రూ.2లక్షలు మంజూరు చేయటంతో పనులను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గిరిజనుల అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. తరోడతండలో ఇప్పటికే మౌళిక వసతుల కోసం లక్షాలాది నిధులతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. త్వరలో జాతీయ రహదారి నుంచి బీటీ రోడ్డు మంజూరుకు కృషి చేస్తామని అన్నారు. మొరం రోడ్డుకు నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యేకు తండా వాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మెన్ సురేందర్‌రెడ్డి, ఎంపీటీసీ బండారి గంగాధర్, మాజీ సర్పంచ్ అరిపోద్దీన్, నాయకులు యహియాఖాన్, చిన్నన్న, మోహన్, గణపతి, లతీఫ్, రాములు, శంకర్, రామారావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రేఖను కేసీఆర్ కాంగ్రెస్‌పై వదిలిన బాణం

నవతెలంగాణ-ఉట్నూర్



ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖా నాయక్‌ను సీఎం కేసీఆర్ కాంగ్రెస్‌పై వదిలిన బాణమని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు పెందుర్ ప్రభాకర్, వినోద్ నాయక్‌లు ఆరోపించారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే బాల్క సుమన్ గతవారం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో మా కోవర్టులను పంపుతున్నామని అన్నారు. రేఖా నాయక్ ఒడిపోతుందనే కావాలని కాంగ్రెస్‌ను ఓడించడానికి కాంగ్రెస్ పార్టీలోకి పంపే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. ఎన్నో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆమె ఈసారి గెలిచే అవకాశాలు లేనందున ఎలాగైనా మళ్లీ ఖానాపూర్‌లో బీఆర్ఎస్ గెలవాలని ఈమెను కాంగ్రెస్‌లో దించే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి ఎమి లేదని, ఏ విధంగా ప్రజల ముందుకెళ్లి ఓట్లు అడుగుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ పట్టణ అధ్యక్షుడు భూమేష్, జిల్లా నాయకులు మంగం విశ్వంరావు, కళ్యాణ్, శేషు, శ్రీనివాస్, నవీన్, విజయ్, ఇస్మాయిల్, అభినయ్, హరీష్, సుఫియాన్, శశి, సాయి, అరుణ్ ఉన్నారు.

వివాహ వేడుకకు హాజరైన బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-కడెం

బీఆర్ఎస్ మండలాధ్యక్షులు జొన్నల చంద్రశేఖర్ గుప్తా అల్లుడు ప్రమోద్ కుమార్ వివాహం ఉట్నూర్ మండల కేంద్రంలో హెచ్‌కేజీఎస్ ఫంక్షన్ హాల్‌లో శనివారం వివాహం జరుగగా మండల బీఆర్ఎస్ నాయకులు వివాహం హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రచార కార్యదర్శి ముబారక్ బిన్ మొహమ్మద్, మండల యూత్ ప్రెసిడెంట్ గౌస్ ఉద్దీన్ చోటు, సోషల్ మీడియా ఇన్‌చార్జీ ఎండీ హసీబ్, పార్టీ మైనార్టీ సీనియర్ నాయకులు కౌసర్, సలీం బిన్ మహమ్మద్, అబ్దుల్లా పాల్గొన్నారు.

నవతెలంగాణ
నమ్మిక తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
ఆదివారం | సెప్టెంబర్ 03, 2023 | www.navatelangana.com

సంఘ భవనానికి నిధులు మంజూరు చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



మున్నూరుకాపు సంఘ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మిట్ట వెంకన్న కోరారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు వినతిపత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాల్లో మున్నూరుకాపులు అధిక సంఖ్యలో ఉన్నారని, పలు మండలాల నుంచి జిల్లాకేంద్రానికి వస్తుంటారని తెలిపారు. సంఘ సమావేశాలు నిర్వహించుకోవడానికి వేధికలేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. స్పందించిన ఎమ్మెల్యే భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు గడ్డల సురేష్, సుంకరి పెంటయ్య, మనిగొండ వెంకటేష్, భుసి భీమేష్, పెద్దపల్లి శ్రీనివాస్, మిట్ట పోషన్న పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణాన్ని చదును చేయించాలి

నవతెలంగాణ-తాండూర్



క్రీడాకారులకు అణువుగా ఉండేందుకుగాను క్రీడా ప్రాంగణాల్లో చదును పనులు చేపట్టాలని ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ సూచించారు. శనివారం తాండూర్ మండలంలోని చౌటపల్లి గ్రామపంచాయతీని ఆకస్మికంగా సందర్శించారు. నర్సరీ, తెలంగాణా క్రీడా ప్రాంగణంలో, అవెన్యూ ప్లాంటేషన్ పనులను పర్యవేక్షించారు. సీసీ రోడ్లునిర్మాణ నాణ్యతను పరిశీలించారు. గ్రామాలలో పారిశుధ్య పనులను పర్యవేక్షించి, పంచాయతీ కార్యదర్శి వసంతకు తగు సూచనలు చేశారు. గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కల పాదులలో కలుపుతీయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ ఏ.లక్ష్మి పాల్గొన్నారు.

తొమ్మిది నెలల వేతనాలు చెల్లించాలి



నవతెలంగాణ-నస్పూర్

గిరిజన ఆశ్రమ పాఠశాల, హాస్టల్‌లో పని చేస్తున్న వర్కర్ల తొమ్మిది నెలలుగా వేతనాలు చెల్లించాలని హాస్టల్ డైలీ వేస్, పార్ట్ టైం, ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా గౌరవ అధ్యక్షుడు దుంపల రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏఓ, జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ అధికారికి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల, హాస్టల్‌లో పనిచేసే అన్ని రకాల వర్కర్లకు గత సంవత్సరం డిసెంబర్ నుండి ఆగస్టు వరకు 9 నెలలుగా వేతనాలు ప్రభుత్వం చెల్లించలేదన్నారు. వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ, పిల్లల చదువు, ఇంటి అద్దెలు, అనేక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. గత జులై 11న సమ్మె నోటీస్ ఇవ్వడం జరిగిందని, కానీ ప్రభుత్వ మాత్రం స్పందించట్లేదన్నారు. సెప్టెంబర్ 6లోగా వేతనాలు, 4 నెలల పెండింగ్ ఏరియర్స్ కూడా చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో 7 నుంచి అన్ని రకాల పనులు బందు పెట్టి సమ్మె చేపడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి టి.లక్ష్మణ్, జిల్లా కమిటీ నాయకులు భాగ్య, భీమయ్య, లక్ష్మీ, అరుణ పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు

నవతెలంగాణ-జన్నారం

మండల పరిధిలోని రెవెన్యూ భూములను ఆక్రమించి అక్రమ కట్టడాలు చేపడితే కఠిన చర్యలు చేపడతామని తహసీల్దార్ వనజారెడ్డి అన్నారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. అక్రమ కట్టడాల కూల్చివేతపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ఇది రెవెన్యూ అధికారుల రోజువారి పనులలో భాగంగానే జరిగిందన్నారు. కూల్చేసిన నాలుగు పిల్లర్లు స్లాబు గుడికి ఎలాంటి సంబంధం లేదన్నారు. అది పూర్తిగా ప్రభుత్వ భూమిలోనే ఉంది అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ భూమిలో నిర్మించారని, ఈ విషయాన్ని పక్కదోవ పట్టించేందుకు కొందరు కుట్రలు చేస్తున్నారని అన్నారు. అనవసరమైన రాద్ధాంతాలు చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మండల ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. అందరూ కలిసికట్టుగా సమస్యలను పరిష్కరించుకుందాం అన్నారు.

బైక్ పైనుండి పడి మహిళా టీచర్ మృతి

నవతెలంగాణ-ఆసిఫాబాద్, వాంకిడి

బైక్ పై నుండి పడి మహిళా టీచర్ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని నేషనల్ హైవేపై చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే మంచిర్యాలకు చెందిన అడికే మంజుల(35) నార్లాపూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా విధులు నిర్వహిస్తోంది. రోజులాగే స్కూటీపై మరో టీచర్‌ను వెంట పెట్టుకుని విధులకు వెళుతున్న క్రమంలో అదుపుతప్పి కింద పడ్డారు. మంజులకు తీవ్రంగా గాయాలు కాగా వెనుక కూర్చున్న మరో మహిళా టీచర్‌కు స్వల్పంగా గాయాలయ్యాయి. ఇద్దరిని మంచిర్యాల ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలిస్తుండగా మార్గమధ్యలో మంజుల మరణించింది. మృతురాలికి భర్త ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. మహిళా ఉపాధ్యాయురాలు మరణించడంతో పలు సంఘాల నాయకులు సంతాపం తెలిపారు.

రెబ్బెనలో నా భూమి నా దేశం

నవతెలంగాణ-బెజ్జూర్

మండలంలోని రెబ్బెన గ్రామంలో మారెమ్మ దేవత వద్ద ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు నా భూమి నా దేశం కార్యక్రమంలో భాగంగా మట్టి సేకరణ చేపట్టడం జరుగుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని బీజేపీ కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పథకాల అమలులో దేశంలోనే అగ్రస్థానం

నవతెలంగాణ-రెబ్బెన

రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో అభివృద్ధిలోనే తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచిందని ఎంపీపీ సౌందర్య ఆనంద్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ప్రగతి నివేదిక పుస్తకాలను ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలు తెలంగాణ రాష్ట్రంలోనే మన ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టారన్నారు. ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మీ, షాదిముబారక్, రైతుబంధు, రైతుబీమా, కేసీఆర్‌కిట్, వికలాంగులకు రూ.4016 పథకాలు పకడ్బందీగా అమలవుతున్నాయని గుర్తు చేశారు. రైతులకు 24గంటల నాణ్యమైన విద్యుత్తు అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సంతోష్, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ అంజాద్ బాషా, రెబ్బెన సర్పంచ్ బొమ్మినేని అహల్య దేవి, పులికుంట సర్పంచ్ బుర్సపోచమల్లు పాల్గొన్నారు

ఆడపడచుల తల్లిదండ్రులకు ఆర్థిక భరోసా 'కల్యాణలక్ష్మి'

నవతెలంగాణ-జైనూర్

తల్లిదండ్రులకు నేనున్నానని భరోసా కల్పిస్తూ ఆడపడుచుల వివాహానికి కల్యాణలక్ష్మి పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని సిర్పూర్(యు) ఎంపీపీ తొడసం భాగ్యలక్ష్మి అన్నారు. శనివారం మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో 12 మంది కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఆడబిడ్డలు ఎంతో గౌరవం పొందుతున్నారని తెలిపారు. ఆడబిడ్డ జన్మిస్తే కేసీఆర్ కిట్ అందజేయడంతో పాటు పెండ్లీడుకొచ్చిన ఆడపడుచుల వివాహానికి కల్యాణలక్ష్మి ద్వారా రూ.1.116 లక్షలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం కేసీఆర్ ప్రభుత్వమని అన్నారు. పేద ప్రజలకు, రైతులకు కేసీఆర్ కిట్టు, షాదీముభారక్, రైతుబంధు, రైతుబీమా, ఆసరా పెన్షన్, 24 గంటల కరెంటు ఇలా ఎన్నో సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తుందని అభినందించారు. ప్రజలు ఎప్పుడు కూడా బీఆర్ఎస్ ప్రభుత్వానికి రుణపడి ఉంటారని తెలిపారు. కల్యాణలక్ష్మి, షాదీముభారక్ చెక్కులు రావడానికి కృషి చేసిన జడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సిర్పూర్(యు) మండల అధ్యక్షుడు తొడసం ధర్మారావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆత్రం భగవంత్‌రావు, వైస్ ఎంపీపీ ఆత్రం ప్రకాష్, సర్పంచ్‌లు వీణాబాయి, అర్క నాగోరావు పాల్గొన్నారు.

104 కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

నవతెలంగాణ-నస్పూర్



104 ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) జిల్లా గౌరవ అధ్యక్షుడు దుంపల రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. శనివారం ఆ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ హోరెత్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 104 ఉద్యోగులకు వైద్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయకపోవడం దారుణమని, వైద్య ఆరోగ్య శాఖలో పని చేసే కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వ విధానం మారాలన్నారు. 2022 నుంచి 104 సేవలు ప్రభుత్వం నిలిపివేసిందని, దీంతో దాంట్లో పనిచేసే వారిని ల్యాబ్ టెక్నిషన్స్, డ్రైవర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్, ఏఎన్ఎం, ఫార్మసిస్టులు పీహెచ్‌సీల్లో విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. 5 నెలల గడిచిన వేతనాలు రావడం లేదని, ఏజెన్సీ నిర్వహకులు వేతనాలు చెల్లించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం సమాన పనికి సమాన వేతనం ఇవ్వడం లేదని ఆరోపించారు. ప్రస్తుతం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పనిచేసే 104 ఏఎన్ఎం, సెకండ్ ఏఎన్ఎంలను ప్రమోట్ చేయాలని, ఏజెన్సీ విధానాన్ని రద్దుచేసి నేరుగా ప్రభుత్వమే వేతనాలు చెల్లించాలన్నారు. ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పోరాటలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో 104 కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.శ్రీనివాస్‌చారి, ఎస్.శ్రీనివాస్, జిల్లా కోశాధికారి వేదావతి, జిల్లా ఉపాధ్యక్షురాలు శిరీష, పూర్ణ శాంతం, జిల్లా సహాయ కార్యదర్శులు రమేష్, శంకరమ్మ, రామచందర్, రాజమ్మ, రమాదేవి, వెంకటేష్ పాల్గొన్నారు.



ఆసిఫాబాద్ : 104లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్ ఎదుట 104 ఉద్యోగులు సీఐటీయూ ఆధ్వర్యంలో మహాధర్న చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 2008 నుంచి 104 ఉద్యోగులు పనిచేస్తున్నారని అన్నారు. ఎంపిక విధానంలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ రోస్టర్ పాయింట్ పద్ధతిలో ఎంపిక చేశారని అన్నారు. అప్పటి నుండి ఎటువంటి ఉద్యోగ భద్రత లేకుండా కొనసాగుతున్నారని తెలిపారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత తమ సర్వీస్ రెగ్యులరైస్ అవుతుందని ఆశాభావంతో ఉన్నారని, అయినప్పటికీ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదన్నారు. జీఓ నెంబర్ 60 ప్రకారం ఉద్యోగులకు స్లాబ్‌ల పద్ధతిని వేతనాలు చెల్లించడం వలన తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఏజెన్సీ విధానాన్ని రద్దుచేసి ప్రభుత్వమే నేరుగా ఖాతాలో ట్రెజరీ ద్వారా వేతనాలు జమ చేయాలని సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారం చేయకపోతే పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పెరిక శ్రీకాంత్, 104 ఉద్యోగులు మహేందర్, ఎండి రఫీక్, రవి, ప్రశాంత్, రాజేశం, రమేష్, రమాదేవి, తిరుమల, అశ్విని, లలిత పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ కాదు.. దగా డీఎస్సీ

- డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్

నవతెలంగాణ-ఆసిఫాబాద్



రాష్ట్ర ప్రభుత్వం టీచర్ ట్రైని అభ్యర్థులను మరోసారి దగా చేస్తోందని చాలీచాలని పోస్టులతో డీఎస్సీ వేయడం సరైనది కాదని వెంటనే మెగా డీఎస్సీ నిర్వహించాలని ప్రస్తుతం వేసింది దగ డీఎస్సీ అని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వ ప్రసాద్ ఆరోపించారు. ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఎండీ.ఆసిఫ్ అలీ అధ్యక్షతన నిర్వహించిన డీఎస్సీ కోసం నిరసన దీక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎప్పటి నుంచో నిరుద్యోగ సమస్య విద్యావంతులను పట్టి పీడిస్తోందని అన్నారు. పదేండ్లుగా కొనసాగుతున్న బీఆర్ఎస్ పాలనలో ప్రశ్నిస్తే రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని అనడం సరికాదన్నారు. పాఠశాలల్లో ఎన్నో ఖాళీలు ఉన్నాయని వాటిని గుర్తించి ప్రస్తుతం వేసిన డీఎస్సీ వెనక్కి తీసుకొని మెగా డీఎస్సీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టకుంటే ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఆసిఫాబాద్ నియోజకవర్గ నాయకులు శేషరావు రాథోడ్, అజ్మీరా శ్యామ్ నాయక్, మర్సుకోల సరస్వతి, యుత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గుండా శ్యామ్, పట్టణ అధ్యక్షుడు మురళీ, దీపక్, వసంతరావ్, కేరమెరి మండల ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు మారుతి, మెస్రం శేకు, బలు, సురేష్, గణపతి, అర్బస్, సక్లేన్, సహెబాష్, గంగారాం, వెంకీ, వినోద్ రాథోడ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

- మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు



నవతెలంగాణ-హాజీపూర్

తెలంగాణలో రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి చెందడం, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ధీమావ్యక్తం చేశారు. శనివారం మంచిర్యాలలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తేనే బతుకులు బాగుపడతాయనే భావనతో ప్రజలున్నారని తెలిపారు. మంచిర్యాల నియోజకవర్గం 20 ఏండ్లు వెనుకబాటును ఎదుర్కొందని ఆరోపించారు. అనాలోచిత నిర్ణయాల వల్ల ప్రజాధనం వృదా చేస్తున్నారని మండిపడ్డారు. తాను ఎన్నికల్లో ఓటమి చెందినప్పటికీ ప్రజా క్షేత్రంలో ఉంటూ సేవ చేశానని తెలిపారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత కొద్దిరోజుల్లోనే ఐబీలో నిర్మిస్తున్న మార్కెట్ భవనం కూల్చివేసి అక్కడ మాతాశిశు ఆసుపత్రిని నిర్మిస్తానని, అందుకు అవసరమైతే నిబంధనలను సైతం ఉల్లంఘిస్తానని పేర్కొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

మంచిర్యాల, లక్షెట్టిపేట మండలాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు శనివారం మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్ సాగర్‌రావు సమక్షంలో పలువురు చేరారు. మంచిర్యాలకు చెందిన సుధమల్ల అశోక్ తేజ, హమాలివాడకు చెందిన ఈసంపల్లి భాస్కర్, లక్షెట్టిపేట మండలం గుళ్లకోటకు చెందిన మాజీ ఉప సర్పంచ్ చంద్రయ్యతో పాటు దాదాపు 300మంది కాంగ్రెసులో చేరారు. ప్రేమ్ సాగర్ రావు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారికి గుర్తింపు ఉంటుందని, బీఆర్ఎస్‌తో విరక్తి చెంది కాంగ్రెస్‌లోకి వలస వస్తున్నారన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

నవతెలంగాణ-నస్పూర్

భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలను 18 సంవత్సరాలు నిండిన వారు సద్వినియోగం చేసుకోవాలని మంచిర్యాల కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బదావత్ సంతోష్ అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్‌లోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో ఏర్పాటు చేసిన నాలుగు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన ఓటరు నమోదుతో పాటు ఓటరు జాబితాలో మార్పులు, సవరణలు, తొలగింపులకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని తెలిపారు. ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలలో నూతన ఓటరు నమోదు, సవరణలు, మార్పులు, తొలగింపుల కొరకు దరఖాస్తులు స్వీకరణ అక్టోబర్ 1, 2023 నాటికి 18 ఏండ్లు నిండిన వయసు అర్హత గల ట్రాన్స్ జెండర్లు, దివ్యాంగులు, ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. సంబంధిత 6, 7, 8 దరఖాస్తు ఫారములు బూత్ స్థాయి అధికారుల వద్ద అందుబాటులో ఉంటాయని తెలిపారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ఓటర్స్.ఈసీఐ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా చేసుకోవచ్చని సూచించారు. ఓటర్ హెల్ప్ లైన్ మొబైల్ యాప్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

- ఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాంప్రసాద్

నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని, అలాగే ఐటీఐ కళాశాల భవనాన్ని నిర్మించాలని నవతరం స్టూడెంట్ ఫెడరేషన్(ఎన్ఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు రాంప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో నవతరం స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నో పోరాటాలతో మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఐటీఐ కాలేజీలు సాధించుకున్నామన్నారు. ఆ కళాశాలలో కనీస వసతులు లేవన్నారు. 9 సంవత్సరాల పాలనలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను తుంగలో తొక్కిందన్నారు. విద్యార్థుల కనీస అవసరాలు కూడా తీర్చలేదని మండిపడ్డారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించకపోతే ఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతమని హెచ్చరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు నీరటి రాకేష్, రంజిత్, మండల నాయకులు మహేష్, ప్రశాంత్, రఘు, సతీష్, నగేష్ పాల్గొన్నారు.

భూకబ్జాదారులపై కేసులు నమోదు చేయాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గోమాస ప్రకాష్



నవతెలంగాణ-హాజీపూర్

పేదల గుడిసెలు తగలబెట్టిన భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గోమాస ప్రకాష్ డిమాండ్ చేశారు. శనివారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చెన్నూరులోని బావురావుపేట శివారు సర్వే నెంబర్ 8లో ఉన్న ప్రభుత్వ అసైన్డ్ భూమిలో నిరుపేదలైన ప్రజలు గత ఐదు నెలలుగా గుడిసెలు వేసుకొని జీవనం కొనసాగిస్తున్నారన్నారు. ఓర్వలేని కొంతమంది ఆ భూమిని కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. అందులో భాగమే శనివారం ఉదయం 9 గంటలకు పేదలు వేసుకున్న గుడిసెలను 200 మంది రౌడీలు, గుండాలను పంపి ట్రాక్టర్లతో కూల్చివేశారన్నారు. అనంతరం పెట్రోల్ పోసి గుడిసెలను తగలబెట్టారని పేర్కొన్నారు. అడ్డుకున్న మహిళలపై కూడా దాడులు చేశారన్నారు. చెన్నూరు నడిబొడ్డులో ఇంత దాష్టీకానికి పాల్పడిన భూ కబ్జాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకొని వెంటనే అరెస్టు చేయాలనీ డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్, పోలీసు ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, అక్రమ పట్టాలను వెంటనే రద్దుచేసి, గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న పేదల ఇండ్లకు పట్టాలు ఇవ్వాలన్నారు. పేదలకు రక్షణ కల్పించాలని లేని పక్షంలో సీపీఐఎం పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు దుంపల రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న రెండో ఏఎన్ఎంల నిరసన



నవతెలంగాణ-ఆసిఫాబాద్

బేషరతుగా తమ సర్వీస్ రెగ్యులర్ చేయాలని డిమాండ్‌తో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిర్వహిస్తున్న సమ్మెలో భాగంగా రెండవ ఏఎన్ఎంలు 18వ రోజు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ మాట్లాడుతూ రెండో ఏఎన్ఎంల కడుపుకోత ప్రభుత్వం అర్థం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ నిర్వహించాలనే డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. రెండవ ఏఎన్ఎంలు చాలీచాలని వేతనాలు తీసుకుంటూ ప్రజల ఆరోగ్యాలు కాపాడడంలో కీలకపాత్ర పోషిస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి నోటిఫికేషన్ రద్దుచేసి రెగ్యులర్ చేయాలని లేని పక్షంలో ఈ సమ్మెను మరింత ఉధృతం చేస్తామని ప్రగతి భవన్ ముట్టడి కార్యక్రమం నిర్వహించనున్నట్లు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు టి.దివాకర్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి చిరంజీవి, ఏఎన్ఎంల సంఘం రాష్ట్ర నాయకురాలు వసంత, జిల్లా అధ్యక్షురాలు సంతోషి, ప్రధాన కార్యదర్శి పుణ్యవతి, ఉపాధ్యక్షులు రజిని, భాగ్య, ప్రచార కార్యదర్శులు భూదేవి, ప్రమీల కోశాధికారి సునీత, నాయకులు తిరుమల, సునీత, రాజేశ్వరి పాల్గొన్నారు.

జొన్న పంట పరిశీలన

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని సంవాతి గ్రామ పంచాయతీలో సాగు చేస్తున్న జొన్న పంటలను శనివారం డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ కుమారస్వామి క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. సేంద్రియ పద్ధతిలో సాగుచేస్తున్న జొన్న పంట సాగు వివరాలను అడిగి తెలుసుకున్నారు. మార్కెటింగ్, అమ్మకం ధరలు తదితర వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరు సేంద్రియ పద్ధతి ద్వారానే పంట సాగు చేయాలని సూచించారు. ఎప్పటికప్పుడు పంట మార్పిడి చేయాలని, అప్పుడే రైతులకు అధిక లాభం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో సేంద్రియ సాగు ఇన్స్‌పెక్టర్ శివరామకృష్ణ, వ్యవసాయ అధికారి సునీల్‌కుమార్, సర్పంచ్ దేవ్‌రావు, గ్రామపెద్దలు భీంరావు, వ్యవసాయ విస్తరణ అధికారులు తాండవ కృష్ణ, విష్ణు, అరవిందస్వామి పాల్గొన్నారు.

6 నుంచి గైర్హాజరు ఉద్యోగులకు ఫ్యామిలీ కౌన్సెలింగ్

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియా వివిధ గనులు, విభాగాలలో పనిచేస్తూ గైర్హాజరవుతున్న ఉద్యోగులకు సెప్టెంబర్ 6 నుంచి 11 వరకు జనరల్ మేనేజర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఫ్యామిలీ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు జీఎం బి.సంజీవరెడ్డి ఒక ప్రకటన పేర్కొన్నారు. ఈ ఫ్యామిలీ కౌన్సిలింగ్‌కు 2022, 2023 జులై 31 వరకు 50 మాస్టర్ల కంటే తక్కువ చేసిన వారు తప్పనిసరిగా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 6న ఇందారం ఉపరితల గని, ఇందారం 1ఏ గని ఉద్యోగులకు, 7న శ్రీరాంపూర్ ఉపరితల గని, జనరల్ మేనేజర్ కార్యాలయం, సెక్యూరిటీ విభాగ ఉద్యోగులకు, 8న ఎస్ఆర్పీ1, ఎస్ఆర్పీ 3అండ్3ఏ గనుల ఉద్యోగులకు, 9న ఆర్కే-7, ఆర్కే న్యూటెక్ ఏరియా వర్క్ షాప్, ఏరియా స్టోర్స్, టింబర్ యార్డ్ ఉద్యోగులకు, 11న ఆర్కే 5 అండ్ 6, కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ ఉద్యోగులకు ఫ్యామిలీ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మెగా డీఎస్సీ కోసం ఎన్ఎస్‌యూఐ నిరసన దీక్ష

నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలో శనివారం ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో మెగా డీఎస్సీ ప్రకటించాలని నిరసన దీక్ష చేపట్టారు. ఈ నిరసన దీక్షలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి అజ్మత్ ఖాన్ మాట్లాడుతూ మెగా డీఎస్సీలో ప్రమోషన్ల ఖాళీలను చూపించాలని అదేవిధంగా ప్రభుత్వ విద్య వ్యవస్థను ప్రయివేటుకు దీటుగా బలోపేతం చేయాలన్నారు. స్టూడెంట్ రేషియో కాకుండా సబ్జెక్టుల రేషియో ప్రకారం ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు కామెర రాకేష్, జిల్లా నాయకులు వంశీ, అజ్మీర్ అఖిల్, తిరుపతి, రఘువర్ధన్, దాసరి గణేష్, బన్నీ పాల్గొన్నారు

ఆకట్టుకున్న ఫ్రెషర్స్‌డే కార్యక్రమాలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలోని వివేకానంద జూనియర్ కళాశాల ఫ్రెషర్స్‌డే కార్యక్రమాలను శనివారం స్థానిక వినయ్ గార్డెన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు, మెమెంటోలు అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ అనూప్‌తో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ట్రైనీ ఐఏఎస్‌లకు వీడ్కోలు సమావేశం

నవతెలంగాణ-నిర్మల్

జిల్లా సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో శిక్షణ పొందుతున్న ఐఏఎస్‌లకు వీడ్కోలు సమావేశం శనివారం నిర్వహించారు. ట్రైనీ ఐఏఎస్‌లు తాము పర్యటించిన ప్రాంతాలలోని అనుభవాలను ఒక్కొక్కరుగా కలెక్టర్ వరుణ్‌రెడ్డికి వివరించారు. ఈ సందర్భంగా వారికి కలిగిన సందేహాలను కలెక్టర్ నివృత్తి చేశారు. కేంద్ర రాష్ట్ర పథకాల గురించి ట్రైనీ ఐఏఎస్‌లకు వివరించారు. సమావేశంలో కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

- మానవహారంగా ఏర్పడి ఉద్యోగుల నిరసన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని ఆ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పడాల రవీందర్, మాదవ్ డిమాండ్ చేశారు. రాష్ట్ర విద్యాశాఖ సమగ్రశిక్షలో పనిచేస్తున్న తమను రెగ్యులర్ చేయాలని కోరుతూ ఉద్యోగుల ఆందోళన కొనసాగుతోందని అన్నారు. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట టెంట్ వేసుకుని 5 రోజులుగా దీక్షలు చేపడుతున్నామని అన్నారు. అందులో భాగంగా శనివారం శిబిరం వద్ద నుంచి ర్యాలీగా తరలివెళ్లి ఎన్టీఆర్‌చౌక్‌లో మానవహారంగా ఏర్పడి వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మినిమం టైం పేస్కేల్ కల్పించాలని కోరారు. పది లక్షల జీవితబీమా, ఆరోగ్యబీమాను కల్పించాలని డిమాండ్ చేశారు. ఓ వైపు ప్రభుత్వం వివిధశాఖల్లోని కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తుంటే విద్యార్హతలు, అనుభవం ఉన్న సమగ్రశిక్షలోని ఉద్యోగుల పట్ల వివక్ష చూపడం ఆవేదన కలిగిస్తోందని అన్నారు. తమ న్యాయ సమ్మతమైన డిమాండ్లను నెరవేర్చేవరకూ తమ పోరాటం సాగిస్తామని స్పష్టం చేశారు. దీక్షా శిబిరాన్ని డీఈఓ జయశీల సందర్శించి సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కోశాధికారి కె.ప్రశాంత్ రెడ్డితో పాటు క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్, కేజీబీవీ, యూఆర్ఎస్, డీపీఓ, ఎమ్మార్పీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయివేట్‌కు దీటుగా ఉత్తమ ఫలితాలు సాధించాలి

- కలెక్టర్ రాహుల్ రాజ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రయివేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు ఎంసెట్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శనివారం స్థానిక ప్రీమెట్రిక్ మైనార్టీ వసతి గృహంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు నిర్వహిస్తున్న ఎంసెట్ లాంగ్‌టర్మ్ శిక్షణ శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఎంసెట్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించాలని అన్నారు. జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఎంసెట్‌లో అత్యున్నత ర్యాంకులు సాధించేలా 6నెలల పాటు వసతితో కూడిన శిక్షణను అందించేలా ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. ప్రతిభ కలిగిన 120 మంది ఎంపీసీ, బైపీసీ విద్యార్థులను ఎంపిక చేసి ఇంటర్ సిలబస్‌తో పాటు ఎంసెట్, నీట్, ఐఐటీ, లాంగ్‌టర్మ్ కోచింగ్ అందిస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఇంజనీరింగ్, మెడిసిన్ వంటి కోర్సుల్లో చేరి జీవితంలో ఉన్నత స్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు తల్లి తండ్రులు, అధ్యాపకులు ప్రోత్సాహం అందించాలని సూచించారు. అనంతరం వసతి గృహంలోని తరగతి, వసతి గదులు, మరుగుదొడ్లను కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా, డీఐఈఓ రవీందర్, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

19వ రోజుకు ఏఎన్‌ఎంల నిరసన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రెగ్యులర్ చేయాలనే డిమాండ్‌తో తెలంగాణ యూనిటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో వారు కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న సమ్మె కొనసాగుతోంది. శనివారం సమ్మె 19వ చేరుకుంది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం తమ ఆవేదనను అర్థం చేసుకోవాలని అన్నారు. షోకాజ్ నోటీసులిచ్చి భయపెట్టాలని చూడొద్దని కోరారు. ఎటువంటి రాత పరీక్షలు లేకుండా రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో రోజుకోరీతిలో నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. సమ్మె శిబిరం వద్దనే ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంపీహెచ్‌ఏ(ఎఫ్) పోస్టుల భర్తీ కోసం విడుదల చేసిన నోటిఫికేషన్‌ను తక్షణమే రద్దు చేయాలని అన్నారు. 1520 పోస్టుల భర్తీకి పరీక్ష నిర్వహించి సెలక్ట్ చేయడం సరికాదని, దీంతో కాంట్రాక్టు ఉద్యోగులమైన తాము కూడా పరీక్ష రాయాల్సి వస్తోందని తెలిపారు. మెరిట్ వస్తేనే సెలక్ట్ అయ్యే పరిస్థితి నెలకొందన్నారు. సర్వీసుకు 20 మార్కులు వెయిటేజి ఇచ్చినా ప్రయోజనం ఉండదన్నారు. ఇప్పటికైనా స్పందించి తమను రెగ్యులర్ చేస్తూ వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. అప్పటివరకు సమ్మెను ఆపేదిలేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల చిన్నన్న, యూనియన్ కార్యదర్శి నవీన్ కుమార్, ఏఎన్‌ఎంలు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

నవతెలంగాణ-కాగజ్‌నగర్



తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం ఎమ్మెల్యే కోనేరు కోనప్పకు ఆశా వర్కర్లు వినతిపత్రం ఇచ్చారు. ముందుగా స్థానిక బస్టాండ్ నుండి ఎమ్మెల్యే ఇంటి వరకు ఆశా వర్కర్లు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్ మాట్లాడుతూ ఆశా వర్కర్లకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 18వేల ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు కేరళ రాష్ట్రాలలో ఇప్పటికే ఫిక్స్‌డ్ వేతనాలు ఇస్తున్నారని, ధనిక రాష్ట్రమైన తెలంగాణలో మాత్రం ఇవ్వడం లేదని అన్నారు. పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలను కూడా వెంటనే చెల్లించాలని అన్నారు. సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకుపోయి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించని పక్షంలో ఈ నెల 11న ఛలో హైద్రాబాద్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు పంచశీల, భాగ్య, ప్రమీల, వాణి, సమీరా, లక్ష్మి, సంధ్య పాల్గొన్నారు.



ఆసిఫాబాద్ : ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వెళ్లి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, ప్రతి ఆశా కార్యకర్తకు హెల్త్ కార్డులు, ప్రమాద బీమా రూ.5లక్షలు ఇవ్వాలన్నారు. రిటైర్మెంట్ కల్పించి సంక్షేమ పథకాలు అన్నిటిని వర్తింపజేయాలన్నారు. పారితోషికం లేని అదనపు పనులు ఆశాలతో చేయించకూడదన్నారు. కార్యకర్తలకు ప్రస్తుత సెలవుపై సర్క్యులర్‌ను వెంటనే జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఆశాల సమస్యలు పరిష్కరించకపోతే రానున్న కాలంలో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆశా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు స్వరూప, సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాజేందర్, ముంజం శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీకాంత్, అర్చన, ఓమల, బద్రు బాయి, కవిత, సునీత, సక్కుబాయి, వనిత, నవీన, భారతి పాల్గొన్నారు.

రాజన్న రాజ్యమే వైయస్ అభిమానుల లక్ష్యం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



వైయస్ రాజశేఖర్‌రెడ్డి అందించిన సంక్షేమ పాలనను తెలంగాణ ప్రజలకు అందించడమే వైయస్ అభిమానుల లక్ష్యమని వైయస్సార్ తెలంగాణ పార్టీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కోఆర్డినేటర్ బెజ్జంకి అనిల్ కుమార్ అన్నారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్‌రెడ్డి 14వ వర్ధంతిని శనివారం భజరంగ్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేసి లక్షలాదిమంది నిరుపేదల ప్రాణాలను కాపాడిన గొప్ప మానవత వాదన్నారు. రైతాంగానికి ఒకే దఫా రుణమాఫీ చేయడంతో పాటు 24 గంటల పాటు ఉచిత విద్యుత్తును అందించి వ్యవసాయాన్ని పండగల మార్చిన గొప్ప నాయకుడని పేర్కొన్నారు. ఎన్నో ప్రాజెక్టులను నిర్మించి తాగునీటిని వసతి కల్పించారని గుర్తు చేశారు. పేద విద్యార్థులు చదువులకు ఇబ్బందులు పడకుండా ఉన్నత విద్యను అభ్యసించాలనే ఉద్దేశంతో ఫీజు రియంబర్స్‌మెంట్ అమలు చేశారన్నారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రుల ప్రాణాలను కాపాడేలా 108 అంబులెన్స్‌లను, గ్రామీణ ప్రాంతాల ప్రజల వద్దకే వెళ్లి తక్షణ వైద్య సేవ అందించేలా 104 వాహనాలను ప్రారంభించారని గుర్తు చేశారు. గిరిజనులు ఏళ్లుగా సాగు చేస్తున్న అటవీ భూములకు హక్కు పత్రాలను కల్పించి వారికి అండగా నిలిచిన గొప్ప నాయకుడని కొనియాడారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న తెలంగాణ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించి నియంతల పరిపాలన సాగిస్తుందన్నారు. ప్రభుత్వ విధానాలను ఎండగట్టి రాజన్న రాజ్యాన్ని తీసుకువచ్చేందుకు ప్రతి వైయస్ అభిమాని, పార్టీ కార్యకర్తలు చిత్తశుద్ధితో పనిచేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పెందూర్ మనోహర్, నాయకులు కృష్ణ మీనన్, యాదవ్, మేస్రం శంకర్, ఎస్కే అస్లాం పాల్గొన్నారు.

మహిళా సమస్యల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యత

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లాలోని మహిళలు, యువతులు ఎలాంటి సమస్యలున్నా నిర్భయంగా పోలీసులను సంప్రదించవచ్చని, మహిళల సమస్యల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యత అని ఎస్పీ కే.సురేష్‌కుమార్ తెలిపారు. మహిళల రక్షణపై ఆయన మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం షీటీం, యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్ టీంలు పనిచేస్తున్నాయని తెలిపారు. విద్యార్థినులు, మహిళలు అన్యాయానికి గురైనప్పుడు భయపడొద్దని, ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే నిందితులపై చర్యలు తీసుకుంటామన్నారు. కళాశాల, పాఠశాలల విద్యార్థులకు ర్యాగింగ్, ఈవీటీజింగ్, ఫోక్సో, షీటీం, యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్ అవగాహన కార్యక్రమాల ద్వారా జిల్లాలో అవగాహన కల్పించామన్నారు. జిల్లా వ్యాప్తంగా షీటీంకు ఆగస్టులో 5 ఫిర్యాదులు, 2 ఎఫ్ఐఆర్, 3 కౌన్సెలింగ్ నిర్వహించామని, మొత్తంగా ఈ సంవత్సరంలో 27 ఫిర్యాదులు రాగా, 8 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామని పేర్కొన్నారు. ఒక్క పెటీ కేసు నమోదు చేశామని, విద్యార్థినులను వేధిస్తున్న 9 మందిని వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించామని తెలిపారు. చిన్న పిల్లల రక్షణ విషయంలో పోలీసు శాఖ పటిష్ట చర్యలు చేపడుతుందన్నారు. మహిళలు సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వినియోగంలో చాలా జాగ్రత్తగా ఉండాలని, ఫొటోలు, వీడియోలు పోస్టుచేసే సమయంలో వ్యక్తిగత భద్రతకు సంబంధించి అన్ని రకాల చర్యలు తీసుకోవాలని సూచించారు. నేరుగా సంప్రదించలేని వారు 87126 70564, లేదా దయల్ 100కు సమాచారం. అందించాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

మన ఊరు మన బడి పనులు త్వరగా పూర్తి చేయాలి



నవతెలంగాణ - పెంచికల్‌పేట్

పాఠశాలల్లో మన ఊరు మన బడి పనులను త్వరగా పూర్తిచేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారీ అధికారులకు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పెంచికల్‌పేట్ సంజీవనగర్, ఎలుకపెల్లి ప్రాథమిక పాఠశాలల్లో మన ఊరు మన బడి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో చేసిన పనులు ఎలా ఉన్నాయి, ఏఏ స్థితిలో ఉన్నాయని పరిశీలించి త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. పెంచికల్‌పేట్ ఉర్దూ మీడియం పాఠశాలలో విద్యార్థులకు స్థలం సరిపోకపోవడంతో ఉన్నత పాఠశాలలో ఒక గదిని కేటాయించాలని ప్రధానోపాధ్యాయుడు యాదగిరికి సూచించారు. ఉన్నత పాఠశాలలో డైనింగ్‌హాలుతో పాటు తరగతి గదులను పరిశీలించారు. పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచాలన్నారు. ఆయనతో పాటు సెక్టోరియల్ అధికారులు భరత్‌కుమార్, శ్రీనివాస్, ఎంపీడీఓ గంగాసింగ్, పంచాయతీ రాజ్ జేఈ మగ్బుల్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

సరస్వతికే ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలి

నవతెలంగాణ-నార్నూర్

ఆసిఫాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా మర్సుకొల సరస్వతికే ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని ఆదివాసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని ఆదివాసీ భవనంలో సమావేశమై మాట్లాడారు. నియోజకవర్గంలో ఆదివాసీ ఓట్లే ఎక్కువ ఉన్నాయని, వలస వచ్చిన వారికి టికెట్ ఇవ్వద్దన్నారు. ఇందులో వివిధ సంఘాల నాయకులు కుర్సెంగ నగేష్, చిక్రం భీంరావ్ పటేల్, మడావి జైవంత్, మెస్రం మోతిరాం, కోట్నాక్ తానాజీ పటేల్, మెస్రం తానాజీ పటేల్, మడావి జైవంత్, చిక్రం ఆనందరావ్, మెస్రం దాదేరావ్ పటేల్ ఉన్నారు.

ఓటరు లిస్టును సరిచేయాలని తహసీల్దార్‌కు వినతి

నవతెలంగాణ-బాసర

ఓటరు లిస్టులో తప్పులను సవరించాలని మండలంలోని కిర్గుల్(కె) గ్రామస్తులు కోరారు. శనివారం తహసీల్దార్ పవనచంద్రకు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. పంచాయతీ కార్యాలయంలో జాబితాలో బీసీ ఓట్లను తక్కువగా చూపిస్తూ ఓటరు లిస్టును ప్రదర్శించారని తహసీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. తిరిగి సర్వే చేయించి, నూతన జాబితా ప్రచురించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

49వ రోజుకు రిలే నిరాహార దీక్షలు



బోథ్ : బోథ్ మండలాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ, రెవెన్యూ డివిజన్ సాధన సమితి ఆధ్వర్యంలో చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 49వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో బోథ్ పట్టణానికి చెందిన నాయకులు కూర్చున్నారు. బోథ్ మండల కేంద్రాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ, గత 49 రోజులుగా దీక్షలు కొనసాగుతున్న ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు కూడా లేదని అన్నారు. రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసేంత వరకు రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తామని అన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ సభ్యులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా వైయస్సార్ వర్ధంతి



నవతెలంగాణ-నిర్మల్

దివంగత నాయకులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా డీసీసీ అధ్యక్షులు కుచాడి శ్రీహరిరావు తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఘన నివాళులర్పించారు. వైయస్సార్ హయాంలో ప్రవేశం పెట్టిన సంక్షేమ పథకాలు అభివృద్ధి పనులను కొనియాడారు. నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



తలమడుగు : మండలంలోని సుంకిడి గ్రామంలో దివంగత నాయకుడు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి 14వ వర్ధంతిని సందర్భంగా శనివారం వైఎస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ సభ్యులు ఆడే గజేందర్, తలమడుగు జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కళ్యాణం రాజేశ్వర్, సుంకిడి ఎంపీటీసీ వెంకన్న యాదవ్, సర్పంచ్‌లు గంగారాం, ప్రఫుల్ చందర్‌రెడ్డి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు రఫీక్, ఉండం మాజీ సర్పంచ్ లస్మన్న, సొసైటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ యూత్ ప్రెసిడెంట్ గణేష్, విలాస్ యాదవ్, ఫారుక్, బద్దం నవీన్‌రెడ్డి, వీడీసీ చైర్మెన్ అసం రవి, పాఠశాల చైర్మెన్ గంగన్న, యడిమల రవీందర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దళితబంధును సవరించి, రూ.2లక్షలు ఇవ్వాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దళితబంధును సవరించి, రూ.పది లక్షలను రూ.రెండు లక్షలకు పరిమితం చేసి అర్హులైనవారందరికీ ఈ పథకం ద్వారా లబ్ధిచేకూరేలా చర్యలు చేపట్టాలని బహుజన జాగృతి సేన జిల్లా రతన్ అన్నారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జాగృతి సేన సభ్యులతో కలిసి ఆయన మాట్లాడారు. దళితబంధు వల్ల కొందరే బాగుపడ్డారని, మెజార్టీ ప్రజలు నష్టపోతున్నారని అన్నారు. ప్రజాప్రతినిధుల జోక్యం లేకుండా తెలంగాణలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు ప్రత్యక్షంగా ప్రభుత్వమే ఈ పథకాన్ని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందే ఈ పథకం ద్వారా ప్రయోజనం చేకూర్చాలన్నారు. 75 సంవత్సరాల భారత దేశంలో దళితులకు ఎవరు బంధువులు లేరని, అందువల్ల తెలంగాణ బంధుగా ఈ పథకం పేరు మార్చి అర్హులైన పేదలందరికీ న్యాయం జరిగేలా చూడాలని పేర్కొన్నారు. అందుకోసం బహుజన జాగృతి సేన ఉద్యమిస్తుందని తెలిపారు.

రెండో రోజూ నా మట్టి నా దేశం

నవతెలంగాణ-బోథ్

మండలంలోని పొచ్చెర, కుచులాపూర్ గ్రామంలోని 2వరోజు కార్యక్రమంలో భాగంగా నామట్టి నాదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా నామట్టి నాదేశం అనే కార్యక్రమాన్ని జిల్లా బీజేపీ ఓబీసీ మోర్చ అధ్యక్షులు గోర్ల రాజు యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆజాదీకా అమృత్ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా దేశ రాజధాని ఢిల్లీలో పవిత్ర అమృతవాటికను నిర్మించడానికి దేశంలో ప్రతి గ్రామం నుంచి మట్టి సేకరణకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ పిలుపునిచ్చారని తెలిపారు. వివిధ గ్రామాల్లో ప్రతిఇంటి నుంచి మట్టి సేకరణ చేయడం జరిగిందన్నారు. భారత్ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడుస్తున్నా సందర్భంలో దేశం కోసం అమరులైన వీరులను స్మరించుకుంటూ కలశంలో మట్టిని సేకరించి దేశ రాజధానికి పంపిస్తామన్నారు. గ్రామాల్లో ఉన్న ప్రతి ఒక్క వ్యక్తికి నాదేశం నామట్టి అనే భావన కలగాలని, దేశం చరిత్ర, సాధించిన ఘనతను తెలుసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి చాబంతుల కృష్ణ, నాయకులు ఆకుల రాజేందర్, యువ నాయకులు బత్తుల రాము, పోచ్చెర బ్రహ్మం, కార్తిక్, సాయి, ముత్తన్న మురళి, వెంకట రమణ, ప్రభాకర్, లక్ష్మణ్, గోవర్దన్ మోహన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్యాం, గంగారెడ్డి లస్మన్న, నర్సయ్య పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులను కలిసిన డీసీసీబీ చైర్మెన్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని ఆదిలాబాద్ డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. ఉమ్మడి జిల్లా బీఆర్‌ఎస్ అభ్యర్థులను శనివారం హైదరాబాద్‌లో ఆయన కలిశారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, ముధోల్ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మీలను వేరువేరుగా కలిశారు. ఈ సందర్భంగా వారికి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

నేటి నుంచి ఎమ్మెల్యే అభ్యర్థి పాదయాత్ర

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బాధిత పీడిత వర్గాల విముక్తి కోసం ఆదిలాబాద్ నియోజకవర్గంలో ధర్మ సమాజ పార్టీ జిల్లా అధ్యక్షుడు అదిలాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి అగ్గిమల్ల గణేష్ మహారాజ్ పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా నాయకులు పాదయాత్ర ఇన్‌చార్జ్ బరుకుంటి రాజీవ్ మహారాజ్ అన్నారు. ఈ సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ జైనథ్ మండలంలోని పిప్పర్‌వాడ గ్రామంలో గణేష్ మహారాజ్ చేస్తున్న పాదయాత్ర ప్రారంభ సభను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
ఆదివారం | సెప్టెంబర్ 03, 2023 | www.navatelangana.com

బాల్క సుమన్‌కు సంపూర్ణ మద్దతు

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు రానున్న ఎన్నికల్లో పూర్తి మద్దతు తెలుపుతామని శనివారం పట్టణంలో స్థానిక ఎస్‌ఆర్‌కే పాఠశాల సమీపంలో ని చాకలి ఐలమ్మ విగ్రహం ఎదుట రజక సంఘం సభ్యులు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం సభ్యులు మాట్లాడుతూ ఎమ్మెల్యే బాల్క సుమన్ రామకృష్ణాపూర్ రజక సంఘం భవన నిర్మాణానికి స్థానిక లెనిన్‌నగర్‌లో రెండు గంటల భూమితో పాటు భవన నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేశారని తెలిపారు. బీసీ బంధు పథకంలో భాగంగా 18 మంది రజక సోదరులకు రూ.లక్ష చొప్పున లబ్ధి చేకూర్చారని తెలిపారు. రానున్న రోజుల్లో అర్హులైన లబ్ధిదారులకు బీసీ బంధు పథకం అమలు చేస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. తెలంగాణ సాయుధ, రైతాంగ పోరాట యోధురాలు వీరనారి చాకలి ఐలమ్మ జయంతి, వర్ధంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో కారు గుర్తుకే ఓటు వేసి బాల్క సుమన్‌ను భారీ మెజారిటీతో గెలిపిస్తామని ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం గౌరవ అధ్యక్షులు గాండ్ల సమ్మయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-కోటపల్లి



మండలంలోని నక్కలపల్లి గ్రామానికి చెందిన వేముగంటి మాధవి మహేష్ కుమార్తె సాయిలోచిత కొద్ది నెలల క్రితం అనారోగ్యంతో మరణించింది. శనివారం కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ రాజారమేష్ కుటుంబాన్ని పరామర్శించి రూ. 5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. రాజారమేష్ సాయిలోచిత చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే ఆరోగ్యశ్రీ పథకాన్ని కొనసాగిస్తూ ప్రజలకు అందుబాటులో అధునాతన వైద్యాన్ని అందిస్తామని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో పేద కుటుంబాలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలంటే ప్రజలు ఆనందంగా రావాలని, అలాంటి పాలన కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. ఆదరించి కాంగ్రెస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

డీఈఓ కార్యాలయం ఎదుట సీఆర్‌టీ నిరసన



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

ఇటీవల కేజీబీవీలో ఖాళీల భర్తి చేపట్టిన నియామకాల్లో తనకు అన్యాయం జరిగిందంటూ గాదిగూడ సీఆర్టీ రూప డీఈఓ కార్యాలయం ఎదుట శనివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ బోథ్‌లో సాంఘిక శాస్త్రం విభాగంలో ఉన్న ఒక్క ఖాళీ పోస్టుకు ఇటీవల నిర్వహించిన పరీక్షలో మెరిట్‌లో మొదటి ర్యాంకు సాధించానని, ఆర్డర్ కాపీ సైతం తీసుకున్నట్లు వివరించారు. తీరా ఆర్డర్ కాపితో ఎస్‌ఓ వద్దకు వెళ్లగా అప్పటికే ఆ పోస్టును బదిలీపై వచ్చిన వేరే ఇతర అభ్యర్థి చేత భర్తీ చేసినట్లు తెలుపగా ఆందోళనకు గురైనట్లు పేర్కొన్నారు. అలా ఎలా భర్తీ చేస్తారని ప్రశ్నిస్తే సర్దిచెప్పి 2వ విడతలో అవకాశం ఉంటే పోస్టింగ్ ఇప్పిస్తామని డీఈఓ చెప్పారన్నారు. అప్పటి వరకు గాధిగూడలో కొనసాగాలని కోరగా వారిచ్చిన మాట ప్రకారం గాధిగూడలో పోస్టింగ్ తీసుకున్నట్లు తెలిపారు. తీరా శనివారం 2వ విడతలో డీఈఓ కార్యాలయంలో సంప్రదించగా మీకు ఇప్పటికే గాధిగూడలో కేటాయించామని ఇప్పుడు మళ్లీ వేరే దగ్గర కేటాయించడం కుదరదని చేతులు ఎత్తేయడంతో ఏమి చేయాలో తెలియక న్యాయం చేయాలంటూ నిరసనకు దిగినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. మొదటి ర్యాంకు వచ్చిన తనకు ఎలాగైనా న్యాయం చేయాలని కనీసం ఇప్పుడు మావలలో ఖాళీగా ఉన్న పోస్టులో భర్తీ చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఆగి ఉన్న కారును ఢీ కొట్టిన బైక్

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

మావల గ్రామ సమీపంలో ఆగి ఉన్న కారును వెనుక నుంచి వేగంగా వచ్చి ద్విచక్ర వాహనదారుడు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి క్షతగాత్రులను చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న మావల ఎస్సై వంగ విష్ణువర్ధన్ వివరాల ప్రకారం.. తలమడుగు మండలంలోని ఝరిపునగూడకు చెందిన ఇద్దరు యువకులు శనివారం ఆదిలాబాద్‌కు సొంత పనుల నిమిత్తం వచ్చారు. తిరిగి గ్రామానికి వెళ్తున్న క్రమంలో మావల గ్రామ సమీపంలో ఆగి ఉన్న కారును వేగంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో మేస్రం హనుమంతు అనే యువకుడి పరిస్థితి విషమంగా ఉండగా, మరో యువకుడు టేకం భరత్ చికిత్స పొందుతున్నాడు.

మాటకు బీజేపీ కట్టుబడి ఎస్సీ వర్గీకరణ చేయాలి

నవతెలంగాణ-నేరడిగొండ

ఇచ్చిన మాటకు కట్టుబడి బీజేపీ ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కుడాల స్వామి అన్నారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే 100 రోజుల్లో వర్గీకరణ చేస్తామని, 9 సంవత్సరాలు గడుస్తున్న నేటి వరకు పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశ పెట్టకుండా కాలయాపన చేస్తుందని ఆరోపించారు. ఈ నెల 18 నుంచి 22 వరకు జరగే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించాలన్నారు. లేని పక్షంలో రాబోయే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎమ్మార్పీఎస్ నాయకులు గజ్జల శంకర్, జిల్లా నాయకులు కారం రవి మాదిగ, సీనియర్ నాయకులు రమణ, గణేష్ పాల్గొన్నారు.

నూతన గురుకులాల్లో డిగ్రీ ప్రవేశాల దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఏర్పడిన గురుకుల డిగ్రీ కళాశాలలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్సీఓ గోపీచంద్ శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆదిలాబాద్, కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాల్లో మహిళా డిగ్రీ కళాశాలలు, మంచిర్యాల, నిర్మల్ జిల్లాల్లో బాలుర డిగ్రీ కళాశాలలు మంజూరయ్యాయని పేర్కొన్నారు. బీఏ (ఈపీహెచ్), బీకాం (పీఏ), బీఎస్సీ (ఎంపీసీఎస్), బీఎస్సీ (బీజెడ్‌సీ) కోర్సులలో నేరుగా ప్రవేశం కల్పిస్తామని అర్హులైన అభ్యర్థులు వెంటనే దోస్త్ రిజిస్ట్రేషన్‌తో సంబంధిత కళాశాలల్లో సంప్రదించాలని తెలియజేశారు. మరిన్ని వివరాలకు సేరు శ్రీధర్ (మంచిర్యాల) 7993456620, హుస్సేన్ (నిర్మల్) 8317549426లను బాలుర కళాశాలల కోసం శ్రీవిద్య (ఆదిలాబాద్) 9705736201, సృజనాదేవి (కుమురం భీమ్ ఆసిఫాబాద్) 9491322883లను మహిళా కళాశాలల కోసం సంప్రదించాల్సిందిగా తెలియజేశారు. అడ్మిషన్ పొందిన విద్యార్థులకు అన్ని సదుపాయాలు కల్పించబడతాయని అవకాశాన్ని వృథా చేసుకోవద్దని ఈ సందర్భంగా విద్యార్థులను కోరారు.

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్‌లోని గాంధీనగర్‌కు చెందిన రాము ఇటీవల తన సెల్ ఫోన్ పోగొట్టుకున్నారు. దీంతో టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, సీఈఐఆర్ పోర్టల్ ఆధారంగా పోలీసులు ఆ ఫోన్‌ను ట్రేస్ చేసి తిరిగి బాధితుడికి టూ టౌన్ సీఐ అశోక్ శనివారం అప్పగించారు. కాగా కానిస్టేబుల్ నరేష్ ఇప్పటివరకు పోయిన 9 ఫోన్‌లను రికవరీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ప్రదీప్, నరేష్ సంజీవ్ పాల్గొన్నారు.

నిర్మల్ : పోయిన సెల్ ఫోన్‌ను సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా ట్రేస్ చేసి బాధితులకు జిల్లా ఎస్పీ చల్లా ప్రవీణ్ కుమార్ తమ కార్యాలయాల్లో శనివారం వారి సెల్‌ఫోన్‌లను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఎవరైన తమ సెల్‌ఫోన్‌లను పోగొట్టుకున్న, చోరీ అయిన బాధితులు తక్షణమే సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేస్తే పోయిన సెల్‌ఫోన్ తిరిగి పొందే అవకాశం ఉందన్నారు. సీఈఐఆర్ వెబ్‌సైట్ ద్వారా సెల్‌ఫోన్ పోగొట్టుకున్న, దొంగిలించబడిన ప్రజలు అధైర్య పడకుండా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సీఈఐఆర్ అప్లికేషన్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ వీరన్న, ఐటీకోర్ ఇన్‌చార్జ్ రవి కుమార్‌తో పాటు ఐటీకోర్ విభాగం సిబ్బంది, సెల్‌ఫోన్‌ల యజమానులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పిడుగుపాటుతో ఇద్దరు మృతి

నవతెలంగాణ-బెజ్జూర్



బెజ్జూర్‌లో..



భీమారంలో..

మండలంలోని పోతపెల్లి గ్రామంలో శనివారం పిడుగు పాటుతో ఓ యువతి మృతి చెందగా ఒకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మిరప చేనులో మిరప నారు వేస్తున్న సమయంలో ఒక్కసారిగా ఉరుములతో కూడిన పిడుగు పడడంతో తాడిశం మేగన అలియాజ్ (పోశక్క), తొడిశం బూదక్కలకు తీవ్ర గాయాలు అయ్యాయి. అక్కడే ఉన్న కూలీలు గమనించి అప్పటికే అపస్మారక స్థితిలోకి వెళ్లిన వారిని వెంటనే ఉన్నత వైద్యం కోసం కాగజ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి తొడిశం మేగన ఆయాస్ (పోశక్క)(18) మృతిచెందింది. మరో మహిళ బూదక్క పరిస్థితి విషమంగా ఉంది. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



ఇందిర్గాం గ్రామంలో ఎద్దు మృతి

మండలంలోని కృష్ణపెల్లి గ్రామ పంచాయతీలోని ఇందిర్గాం గ్రామానికి చెందిన నికాడి అశోక్‌కు చెందిన ఎద్దు పిడుగుపడి శనివారం మృతిచెందింది. దీని విలువ సుమారు రూ.30 వేల వరకు ఉంటుందని యజమాని తెలిపారు. బాధితుడు ప్రభుత్వం ఆర్థికసాయం అందించాలని కోరారు.

భీమారం : పిడుగు పాటుకు వ్యక్తి మృతి చెందిన ఘటన మండల కేంద్రంలోని శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తెనుగు వాడలో నివాసం ఉంటున్న బండారి లింగయ్య (65) అనే వ్యక్తి ఉదయం పూట స్థానిక ఎస్‌బీఐ బ్యాంకు పంట రుణం కోసం వెళ్ళి తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఉరుములు ఉరుముతున్న క్రమంలో వర్షం పడుతుందని వెంట వెంటనే లింగయ్య ఇంటికి బయలుదేరాడు, తన ఇంటి సమీపానికి చేరుకునే క్రమంలో అతనిపై పిడుగు పడింది. దీంతో లింగయ్య అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య రంభ, ఒక కూతురు, కుమారుడు ఉన్నారు.

గిరిజనులకు పోషణ మాసంతో ఎంతో లాభం

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవరావు



నవతెలంగాణ-జైనూర్

ఐసీడీఎస్ ద్వారా నిర్వహిస్తున్న పోషణ మాసం కార్యక్రమంతో ఏజెన్సీ ప్రాంత గిరిజన ప్రజలకు ఎంతో లాభముంటుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవరావు అన్నారు. శనివారం మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఐసీడీఎస్ సీడీపీఓ ఇందిరా ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి నేటి వరకు గిరిజనులు అన్ని రకాలుగా లాభం పొందుతున్నారన్నారు. పోషణ మాసం ఏజెన్సీ ఆదివాసీ గిరిజన ప్రాంతాల్లో శిశోర బాలికల్లో రక్తహీనతను తగ్గించేందుకు ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని అన్నారు. అంగన్‌వాడీ టీచర్లు బాలింతలకు, పిల్లలకు, గర్భిణీలకు, శిశోర బాలికలకు అవగాహన కల్పించి పథకాన్ని విజయవంతం చేయాలని కోరారు. విద్యార్థులకు వినోదం, ఆటపాటలతో పాటు విద్య బోధించాలని తెలిపారు. గ్రామంలో మహిళలకు ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించి రక్తహీనత భారిన పడకుండా చూడాలని అంగన్‌వాడీలకు దిశానిర్దేశం చేశారు. అనంతరం శిశోర బాలికలకు కిశోర అమృతం ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి జితేందర్‌రెడ్డి, ఐకేపీ ఏపీఎం సుజాత, సూపర్‌వైజర్ పెంటుబాయి, ఎంపీటీసీ(2) బీబీనూర్, నాయకులు అజ్జులాల పాల్గొన్నారు.

పురుగులమందు తాగి యువకుడి ఆత్మహత్యాయత్నం

- సిగ్నల్స్ ఆధారంగా గుర్తించి ప్రాణాలు కాపాడిన పోలీసులు



నవతెలంగాణ-దహెగాం

పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మండలకేంద్రంలో శనవారం చోటుచేసుకుంది. ఎస్సై సనత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండలకేంద్రానికి చెందిన ఆసంపల్లి మహేష్ ఉదయం 11 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి నేను చనిపోతున్నానని భార్య ఫోన్‌కు మెసేజ్ పెట్టగా గమనించి మెసేజ్‌ను చూసిన మహేష్ భార్య వెంటనే కుటుంబసభ్యులకు తెలిపిందన్నారు. వారు సమాచారాన్ని వెంటనే పోలీసులకు తెలియజేయగా స్పందించిన పోలీసులు సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా లొకేషన్‌ను గుర్తించి మండలకేంద్రానికి సమీపంలోని ప్రాణహిత కెనాల్ సమీపంలో గల మహేష్ వద్దకు చేరుకున్నామన్నారు. అప్పటికే మహేష్ పురుగుల మందు సేవించి ఉండడాన్ని గమనించిన పోలీసులు 108 అంబులెన్స్‌లో స్థానిక ప్రభుత్వ ఆరోగ్యకేంద్రానికి తరలించి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం బెల్లంపల్లి ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్టు ఎస్సై పేర్కొన్నారు.

132-కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలో 132-కేవీ సబ్‌స్టేషన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని సామాజిక కార్యకర్త శ్రీరాముల భుమచారి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్ష శనివారం 6వ రోజు కొనసాగింది. దీక్షకు మండల యువ నాయకులు ఇమ్రాన్ సయ్యద్, కాంగ్రెస్ జిల్లా నాయకులు ముత్యం రాజన్న, దాముఖ కరుణాకర్, హనుమంత రావు, ఆకుల పెద్దయ్య సంఘీభావం తెలిపారు. వెంటనే అధికారులు స్పందించి విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేసి రైతులు, విద్యుత్ వినియోగదారుల సమస్యలు తీర్చాలని డిమాండ్ చేశారు. ఈ పోరాటానికి కాంగ్రెస్ పూర్తి మద్దతు ఉంటుందని ప్రకటించారు.

ఓటరు జాబితా ప్రదర్శన

నవతెలంగాణ-కౌటాల

మండల కేంద్రముతో పాటు మండలంలోని ముత్తంపేట్ గ్రామాలలోని గ్రామ పంచాయతీ కార్యాలయంల్లో శనివారం ఓటరు జాభితాను ప్రదర్శించారు. సర్పంచ్‌లు ఒజ్జల మౌనీష్, అదె శ్రీనివాస్‌ల అధ్వర్యంలో రాబోయే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో 18 ఎండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవడానికి తమ ఓటు నమోదు చేసుకుని గుర్తింపు కార్డులు పొందాలన్నారు. ఈ కార్యాలయంలో ఆర్ఐ దిలీప్ ఉపసర్పంచ్ పసునూరి తిరుపతి పాల్గొన్నారు.

బాదిత కుటుంబానికి మాజీ మంత్రి పరామర్శ

నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మాజీ మార్కెట్ కమిటీ వైస్ చెర్మన్, మాజీ సర్పంచ్ బన్న ఆశాలు కుటుంబాన్ని మాజీ మంత్రి గడ్డం వినోద్ పరామర్శించారు. ముందుగా బన్న ఆశాలు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి గడ్డం వినోద్ మాట్లాడుతు బన్న ఆశాలు చనిపోవడం పార్టీకి తీరని లోటని, అయన జీవితాన్ని కాంగ్రెస్ పార్టీకి అంకితం చేశారని అన్నారు. నిస్వార్థంగా పార్టీకి సేవ చేశారని మా తండ్రి గారితో కలిసి పని చేశారని ఎలాంటి పరిస్థితుల్లోనైనా ఆశాలు కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కారుకూరి రాంచందర్, మాజీ మున్సిపల్ చైర్మన్ మాత్తమరి సూరిబాబు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్, నాయకులు రాజమౌళి, మైదాం రమేష్, గోలేటి స్వామి, ఎల్పుల వెంకటేష్, షేక్ షారుఖ్, ఉడతాల కుమార్, జంపయ్య పాల్గొన్నారు.

ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్



పట్టణంలో సినినటుడు, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలను శనివారం ఆ పార్టీ నాయకులు అల్లూరి సాయికుమార్, నిరంజన్ చౌదరి, తౌటి ప్రభాకర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఈఎస్ఐ ఆస్పత్రి సమీపంలోని హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎల్లగౌడ్ తోటలోని ప్రభుత్వ ఆసుపత్రి, విజేత ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. విజేత హాస్పిటల్ డాక్టర్ విద్యాసాగర్ రావును శాలువాతో సత్కరించారు. డాక్టర్ విద్యాసాగర్ రావు మాట్లాడుతూ కేవలం సినిమా రంగంలోనే కాకుండా అనునిత్యం ప్రజలతో మమేకమై బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికై పవన్ కళ్యాణ్ చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పెరుగు మనీష్, మేకల అనీల్, మాటూరి నిఖిత్, మోతె శ్రీధర్, అఖిల్, సాయి, అక్షయ్, సాయిక్రిష్ణ, గుర్రం ప్రవీణ్ పాల్గొన్నారు.

ఉట్నూర్ : జనసేనపార్టీ అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు శనివారం మండలంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం స్థానిక ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించి, మండలంలోని దంతన్‌పల్లి గ్రామంలో కేక్ కట్ చేసి పవన్ కళ్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం మండల కేంద్రంలోని ఎయిమ్ ఫర్ సేవ బాలుర వసతి గృహంలో ఉచిత అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జనసేనపార్టీ నియోజకవర్గ నాయకులు మేడి శ్రీనాథ్, చవాన్ నరేష్, శ్రీకాంత్, శ్రీను, అనిల్, రవి, అఖిల్, లక్ష్మణ్ జన సైనికులు, అభిమానులు ఉన్నారు.

మాజీ సీఎం వైఎస్‌ఆర్‌కు ఘన నివాళి

- మండలంలో ఘనంగా వైయస్సార్ వర్ధంతి



జన్నారంలో..

నవతెలంగాణ-జన్నారం


ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి మండల కేంద్రంలో వైఎస్‌ఆర్‌సీపీ, కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారంగం ఘన నివాళ్లు అర్పించారు. అనంతరం వైఎస్‌ఆర్‌సీపీ మండల అధ్యక్షుడు ముజఫర్ అలీ ఖాన్ ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయ సాధనకు ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలన్నారు. అనంతరం కాంగ్రెస్ మండలం మాజీ అధ్యక్షుడు బోర్లకుంట ప్రభుదాస్ మాట్లాడుతూ వైఎస్ పాలనాలో ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, రూ.లక్ష రుణ మాఫీ, ఫీజురీయింబర్స్‌మెంట్ లాంటి గొప్ప పథకాలు ప్రజలకు అందిచడం జరిగిందన్నారు. ఈ వర్ధంతి కార్యక్రమంలో జిల్లా నాయకులు మోహన్‌రెడ్డి, ముత్యం రాజన్న, పట్టణ అధ్యక్షుడు దుమల్ల రమేష్, ఎంపీటీసీలు మమత కరుణాకర్, లలిత, హన్మంత్‌రావ్, ఎస్సీ సెల్ అధ్యక్షులు మామిడిపెల్లి ఇందయ్య, ఎస్టీ సెల్ సెల్ అధ్యక్షుడు రవీందర్ నాయక్, నాయకులు దేవయ్య, పెద్దయ్య, యువజన నాయకులు, మంద రాజేష్, ఇమ్రాన్, దుమల్ల ప్రవీణ్, ఎన్ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి అజ్మత్ ఖాన్, నియోజకవర్గం అధ్యక్షుడు కామెర రాజేష్ జిల్లా నాయకులు వంశీ అఖిల్, దాసరి గణేష్ తిరుపతి పాల్గొన్నారు. అదేవిధంగా వైఎస్‌ఆర్‌టీపీ మండల అధ్యక్షుడు ఆంద్రా పురుషోత్తం ఆధ్వర్యంలో వైఎస్‌ఆర్‌కు ఘన నివాళ్లు అర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు.

ఉట్నూర్ : స్వర్గీయ డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కాంగ్రెస్ నాయకులు అన్నారు. శనివారం వైయస్సార్ వర్ధంతి సందర్భంగా శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పులమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు ఖయ్యుం, రాజేశ్వర్ మాట్లాడుతూ వైయస్సార్ ఉమ్మడి రాష్ట్రంలో సీఎంగా అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేశారని అన్నారు. పేద ప్రజలకు, రైతులకు ఎంతో మేలు చేసి ఎన్నో పథకాలు తీసుకొచ్చారని అన్నారు. ఈ రోజు ఆయన మన మధ్య లేకపోవడం చాలా బాధాకరమైన విషయమని అన్నారు. ఆరోగ్యశ్రీ, 108, ఉచిత వైద్యం, ఉచిత విద్యుత్, పోడు భూములకు పట్టాలు, పింఛన్ ఎలాంటి ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి చరిత్రలో నిలిచిన గొప్ప వ్యక్తన్నారు. ఆయన ఆశయ సాధనకు అందరూ పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దేవానందం, సలీం, మహేందర్, నిసార్, అన్నపూర్ణ, నీలాబాయి, రాధాబాయి ఉన్నారు.

నార్నూర్ : మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు కార్యకర్తలు వైయస్సార్ 14వ వర్ధంతి సందర్భంగా వైయస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ప్రవేశ పట్టిన సంక్షేమ పథకాలను, చేసిన సేవలను గుర్తు చేశారు. ఇందులో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, శివాజీ పటేల్, దేవురావ్ లోఖండే, జాదవ్ కైలాష్, బానోత్ వీలాష్, కరీమ్‌ఖాన్, రాథోడ్ గజేందర్, జాకురుల్లాఖాన్, నిజామ్, మైలారం దేవిదాస్, రమేష్ నాయక్, ఉత్తమ్, ఉల్లాస్, నగేష్,షేక్ నసీర్, సంతోష్ ఉన్నారు.




ఉట్నూర్‌లో..



ఆదిలాడ్‌టౌన్‌లో..

ఆదిలాబాద్‌టౌన్ : చెరగని చిరునవ్వుతో, అనేక సంక్షేమ పథకాలతో ప్రజల గుండెల్లో చిరస్థాయిగా గూడుకట్టుకున్న మహానాయకుడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని కాంగ్రెస్ నాయకులు కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ఆయన క్యాంపు కార్యాలయం ప్రజా సేవాభవన్‌లో వైఎయస్సార్ 14వ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గిమ్మ సంతోష్, భరత్ వాగ్మరే, షకీల్, పుంద్రు రవి కిరణ్ రెడ్డి, అయ్యూబ్ ఖాన్, చాన్ పాషా, అస్బాత్ ఖాన్, హరీష్‌రెడ్డి, మహమూద్, సంతోష్‌రెడ్డి, నాగన్న, పోతారాజు, సంతోష్ పాల్గొన్నారు.



నార్నూర్‌లో..